
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగన్ జైలుకు వెళ్లడం ఖాయం

ఏపీ కాంగ్రెస్ పార్టీ చీఫ్ స్పోక్స్ పర్సన్ తులసిరెడ్డి



మాట్లాడుతున్న ఏపీ కాంగ్రెస్ పార్టీ చీఫ్ స్పోక్స్ పర్సన్ తులసిరెడ్డి

కోవెలకుంట్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఏపీలో లిక్కర్ స్కాం కేసులో మాజీ సీఎం జగన్ కూడా జైలుకు వెళ్లడం ఖాయమని ఏపీ కాంగ్రెస్ పార్టీ చీఫ్ స్పోక్స్ పర్సన్ తులసిరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బనగానపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి బాలుయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా తులసిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో వైసీపీ వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందన్నారు. అదంతా మద్యం స్కాంలో అక్రమంగా సంపాదించినదేనని, ఏపీలో మద్యంస్కాం జరిగింది ముమ్మాటికీ నిజమేనన్నారు. కూటమి ప్రభుత్వం కూడా గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి బూత్, గ్రామ, మండల, జిల్లాస్థాయిలో పార్టీ సంస్థాగతంగా నిర్మాణం చేపట్టి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రిటైర్డ్ సీటీవో చేతివాటం 7

- కొడుకుతో కలసి రోడ్డుపై అక్రమ వసూళ్లు
- కేసు నమోదు చేసిన ప్యాపిలి పోలీసులు

చాగలమర్రి లో వెలసిన అక్రమ వెంచర్



అడ్డగోలుగా వెంచర్లు

- పొలాలను కన్వర్షన్ చేయకుండానే ప్లాట్లు
- వైసీపీ నాయకుల 'రియల్' దందా
- పట్టించుకోని అధికారులు

ఆళ్లగడ్డ, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని పలు మండలాల్లో అక్రమ వెంచర్లు అడ్డగోలుగా వెలుస్తున్నాయి. పచ్చని పొలాలను ప్లాట్లుగా మార్చి కొంత మంది నాయకులు 'రియల్' దందా చేస్తున్నారు. పొలాలను కన్వర్షన్ చేయకుండానే ప్లాట్లుగా మారుస్తున్నారు. ఆళ్లగడ్డలోని పలు మండలాల్లో రియల్ భూం పెరగడంతో కొనుగోలుదా రులు కూడా అదేస్థాయిలో విక్రయాలు సాగిస్తున్నారు. ఈ తంతు ఆళ్లగడ్డ, చాగలమర్రి, శిరివెళ్ల మండలాల్లో అధికంగా ఉంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అక్రమ లేవుట్లపై చర్యలకు ఉపక్రమిస్తుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన అక్రమ లేవుట్లను గుర్తించే పనిలో పడింది. అధికారులు ఒక పక్క చర్యలకు ఉపక్రమిస్తున్నా అక్రమ లేవుట్లు మాత్రం ఆగడం లేదు. ప్రస్తుతం కొనుగోలు చేసిన వాటిలో అక్రమంగా ప్లాట్లు వేసి విక్రయాలు సాగిస్తూనే ఉన్నారు. కొన్ని మండలాల్లో వైసీపీ నాయకులు ఇంకా చక్రం తిప్పుతూనే ఉన్నారు. ముఖ్యంగా చాగలమర్రి మేజర్ గ్రామ పంచాయతీ వైసీపీ నాయకుల ఆధీనంలో ఉండంతో అక్రమ లేవుట్ల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. పట్టణం చుట్టూ ఎక్కడ చూసినా లేవుట్లు వేసిన వెంచర్లు కనిపిస్తాయి. లేవుట్లను విక్రయించడానికి 20 మందికి పైగా మధ్యవర్తులు ఉన్నారంటే వ్యాపారం ఏ మేరకు జరుగుతుందో అర్థవుతుంది. ఆళ్లగడ్డ పట్టణంలో 60కి పైగా అక్రమ లేవుట్లు ఉండగా పట్టణ ప్రణాళిక అధికారులు 37, కూడా అధికారులు 5 అక్రమ లేవుట్లు ఉన్నట్లు గుర్తించారు. ఆళ్లగడ్డ పరిధిలో 145ఎకరాల్లో అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

అపరాధ రుసుము కింద..

అనుమతులు లేని అక్రమ లేవుట్లలో స్థలాలు కొనుగోలు చేసినవారు నిర్మాణాలు చేయాలంటే అపరాధ రుసుము కింద పెద్దఎత్తున చెల్లించాల్సి వస్తుంది. దీంతో లేవుట్లు కొనుగోలుదారులుఇబ్బందులు పడుతున్నారు. భూమి విలువలో 14శాతం సొమ్ము జరిమానాగా వేసి గ్రామాలు, పట్టణాల్లో ఇంటి నిర్మాణాల అనుమతులు ఇచ్చే వారు. అనుమతులు లేని లేవుట్లు ఎక్కువగా ఉండడంతో భవన నిర్మాణ ప్రణాళిక కోసం భూమి విలువలో అదనంగా 33శాతం రుసుము అదనంగా చెల్లించాలని నిబంధనలు చెబుతున్నాయి. లేవుట్లలో స్థలాలు కొన్నవారు వాటిని క్రమబద్ధీకరించుకోవాలంటే వేలకు వేలు ఖర్చు చేయ్యాల్సి వస్తుంది. సెంటుస్థలానికి రూ.10 వేలు ఖర్చు చేయాల్సి వస్తుంది. ల్యాండ్ కన్వర్షన్ చేయించుకోవాలంటే ఈ ఖర్చు మరింత పెరుగుతుండడంతో సామాన్యులు లబోదిబోమంటున్నారు.



ఆళ్లగడ్డ శివారులో వెలిసిన లేవుట్

నోటీసులు కూడా ఇచ్చాం..



మున్సిపల్ పరిధిలోని అక్రమ లేవుట్లపై ఇప్పటికే చర్యలు తీసుకుంటున్నాం. పలు వెంచర్ల యజమానులకు నోటీసులు కూడా ఇచ్చాం. కొన్ని వెంచర్లలో హద్దు రాళ్లను కూడా తొలిగించాం. అనుమతుల్లేకుండా వెంచర్లలో నిర్మాణాలు చేస్తే వాటికి చర్యలు తీసుకుంటాం. వెంచర్ల వేసుకునేవారు ల్యాండ్ కన్వర్షన్ చేయించుకొని లేవుట్లు వేసుకోవాలి.

● కిశోర్, మున్సిపల్ కమిషనర్, ఆళ్లగడ్డ

పొంగి పొర్లుతున్న వాగులు

ఇస్కాల నందీశ్వరాలయంలోకి వరద




చెలిమిల్ల గ్రామంలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఎద్దులవంక

పాములపాడు, జూలై 23(ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాములపాడు మండలంలో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎగువన నల్లమల అటవీప్రాంతం నుంచి వరద భారీగా వస్తుండటంతో మండలంలోని వాగులకు జలకళ సంతరించుకుంది. ప్రమాదకర స్థాయిలో వరద ఉండటంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చెలిమిల్ల గ్రామ శివారులోని ఎద్దులవంక, సుద్దవాగు, భవనాశి వాగులో నీటిప్రవాహం ప్రమాదకరస్థాయిలో కనిపిస్తోంది. కంబాలపల్లి నుంచి ఇస్కాల వెళ్లే దారిలో గల భవనాశి వాగు నీటి ఉధృతి పెరగడంతో ఆవైపుగా వెళ్లే ఇస్కాల, కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రైతులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. భవనాశి నీటి ఉధృతికి ఒడ్డున ఉన్న నందీశ్వర ఆలయంలోని శివలింగం నీట మునిగింది.

ఉరకలెత్తిన తెలుగుగంగ

- వెలుగోడు డ్యాం నుంచి మూడు గేట్లు ఎత్తివేత



వెలుగోడు జలాశయ స్పిల్‌వే గేట్ల నుంచి ప్రవహిస్తున్న నీరు

వెలుగోడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు తెలుగుగంగ జలాశయం నుంచి కృష్ణా జలాలను బుధవారం అధికారులు దిగువకు విడుదల చేశారు. జలాశయానికి చెందిన మూడు స్పిల్‌వే గేట్లను తెలుగుగంగ ఈఈ శివశంకరరెడ్డి, ఏఈఈ శివనాయక్ ఆరు వేల క్యూసెక్కుల నీటిని గాలేరుకు విడుదల చేశారు. జలాశయంలోకి బనకచర్ల సముదాయం నుంచి 5200 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా స్పిల్‌వే ద్వారా ఆరువేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. వీటిలో మద్రాసు మెయిన్ కెనాల్‌కు 2,500, కుడి తూము ద్వారా 60, ఎడమ తూము ద్వారా 30, నంద్యాల తాగునీటి కోసం 20 క్యూసెక్కుల చొప్పున దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 263.90మీటర్ల వద్ద 15.573 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువకు నీటి ప్రవాహం ఉధృతంగా ఉన్న నేపథ్యంలో గాలేరు నది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

హోంగార్డు సంక్షేమానికి కృషి చేస్తాం

కమాండెంట్ మహేశ్‌కుమార్



గౌరవ వందనం స్వీకరిస్తున్న పోలీసులు

నంద్యాల టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): హోంగార్డు సంక్షేమానికి కృషి చేస్తామని హోంగార్డు కమాండెంట్ మహేశ్‌కుమార్ స్పష్టం చేశారు. బుధవారం ఎస్పీ ఆదేశాల మేరకు నంద్యాలకు వచ్చిన కమాండెంట్ హోంగార్డుల కవాతును పర్యవేక్షించారు. అనంతరం దర్బార్ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర అలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు డీఎస్పీ ప్రసాద్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు మంజునాథ్, ఆర్ఎస్ఐ ఉమామహేశ్వరరెడ్డి, దాదాపీరయ్య, కాళీ చరణ్ పాల్గొన్నారు

రథోత్సవం ఎదుట కళాకారుల ప్రదర్శన



స్వర్ణరథంపై ఆది దంపతులు

శ్రీశైలంలో ఘనంగా ఆరుద్ర నక్షత్ర వేడుకలు



నంద్యాల కల్చరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలంలో మల్లికార్జునస్వామి, భ్రమరాంబికదేవి బుధవారం స్వర్ణరథంపై భక్తులకు దర్శనమిచ్చారు. శివయ్య జన్మనక్షతం ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు స్వామి అమ్మవార్లకు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను బంగారురథంపై అధిష్ఠింపజేశారు. భక్తుల శివనామస్మరణతో వేదమంత్రాల నడుమ గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు స్వర్ణరథోత్సవాన్ని నిర్వహించారు. కళాకారులు కోలాటం, తప్పెట, బిందు మొదలైన కళారూపాలు ప్రదర్శిస్తుండగా రథోత్సవం కోలాహలంగా సాగింది. ఈ వేడుకకు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.



శ్రీశైలం ఆలయంలో ఎమ్మెల్యే బుడ్డా

● ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లె గ్రామంలో ఓ రైతు 40 ఏళ్ల క్రితం 3 ఎకరాలు కొనుగోలు చేశారు. అప్పటి ప్రభుత్వ సర్వేయర్‌తో సర్వే చేయించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. నాటి నుంచి వారి అనుభవంలోనే ఉంది. పట్టాదారు పాసు పుస్తకాలు తీసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన రీసర్వేలో 2.40 ఎకరాలే ఉన్నట్లు చూపారు. క్షేత్రస్థాయిలో మూడెకరాలు భూమి ఉన్నా, సర్వేలో 60 సెంట్లు మాయం చేశారు. తేడా ఎందుకొచ్చింది? సరిచేయమని గ్రామ సర్వేయర్, వీఆర్‌వో, తహసీల్దారును అడిగితే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారు.

● వెల్దుర్తి మండం కృష్ణాపురం గ్రామంలో 60 ఏళ్ల క్రితం ప్రభుత్వ భూమిని అసైన్‌మెంట్ చేసి భూమి లేని నిరుపేదలకు డి-పట్టా ఇచ్చారు. అందులో భాగంగానే కురవ మల్లేశ్వరి పేరిట సర్వే నంబరు.557లో 1.74 ఎకరాలు ఇచ్చారు. రీసర్వేలో జాయింట్ ఎల్‌పీఎం నంబరు 1662 కింద ఆమె పేరిట 325 ఎకరాలు ఉన్నట్లు చూపించారు. సర్వే అధికారుల మాయాజాలం వల్ల వ్యవసాయ కూలీ భూమి ఆన్‌లైన్ రికార్డుల్లో మూడు వందల ఎకరాలకు పైగా భూ స్వామిగా మారిపోయింది. కొడుకు కూతురుకు రావాల్సిన 'తల్లికి వందనం' సాయం రూ.26 వేలు ఖాతాలో జమ కాలేదు.

ఇలా ఒకరిద్దరు కాదు.. జిల్లాలో రీసర్వే జరిగిన గ్రామాల్లో వేలాది మంది బాధితులు ఉన్నారు. గత జగన్ ప్రభుత్వం చేసిన రీసర్వే పాపం రైతులకు శాపాలై వెంటాడుతోంది. కష్టజీవులకు అవస్థలు, కష్టాలు మిగిల్చింది. ఐదారుగురు రైతులకు చెందిన భూములకు ఒకే 'జాయింట్ ఎల్‌పీఎం నంబరు' ఇవ్వడం, ప్రతి రైతు పేరిట మొత్తం భూమిని చూపడంతో 'తల్లికి వందనం' సాయం అందుకోలేకపోయారు. తాజాగా అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ సాయం కోల్పోయే పరిస్థితి వచ్చింది. భూ కొలతల్లో భారీ తేడాలు చూపడంలో గ్రామాల్లో న్యాయ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇదే అదనుగా భావించిన రెవెన్యూ అధికారులు రికార్డులు సరిచేసే క్రమంలో లంచాల రూపంలో పిండేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో లక్షకు పైగా రీసర్వే బాధిత రైతులు ఉన్నట్లు అంచనా. ఆ వివరాపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.



రైతులకు శాపం..!

- ఏడాది దాటినా అన్నదాతలకు తీరని రీసర్వే కష్టాలు
- దశాబ్దాలుగా సాగులో.. భూమి కొలతల్లో తేడాలు
- జాయింట్ ఎల్‌పీఎంలతో తీవ్ర సమస్యలు
- పథకాలను కోల్పోతున్న అర్హులు

కర్నూలు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నెలకొన్న భూ వివాదాలు పరిష్కరించే లక్ష్యంగా గత వైసీపీ హయాంలో 'భూముల రీసర్వే'కు శ్రీకారం చుట్టింది. నాడు జగన్ ప్రభుత్వం చేపట్టిన రీసర్వే పాపాలు ఏడాది దాటినా రైతులను వెంటాడుతూనే ఉన్నాయి. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మూడు విడుతల్లో రీసర్వే చేశారు. 48,514 జాయింట్ ఎల్‌పీఎం నంబర్లు పరిధిలో 1,37,979 మంది రైతుల ఖాతాలు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో 252 గ్రామాల్లో రీసర్వే చేశారు. 21,588 జాయింట్ ఎల్‌పీఎం నంబర్లు పరిధిలో 61,817 రైతుల ఖాతాలున్నాయి. 1907లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం భూములు రీసర్వే చేసింది. భూమి రికార్డులు, విస్తీర్ణానికి సంబంధించి పక్కా వివరాలతో రీ-సెటిల్‌మెంట్ రిజిస్టర్ (ఆర్ఎస్ఆర్)ను రూపొందించింది. స్వాతంత్ర్యం అనంతరం భూముల క్రయవిక్రయాలు, అన్నద మ్ముల విభాగాలు దృష్ట్యా సరిహద్దుల మార్పు జరిగాయి. వాటిని సరి చేస్తూ 1979లో భూమి హక్కులు, యాజమాన్య వివరాలతో రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌వోఆర్) తీసుకొచ్చింది. భూములకు సంబంధించిన కీలక పత్రం ఇది. ఒక సర్వే నంబరులో ఎంత భూమి ఉంది..? యాజమాన్యం హక్కులు ఎవరి పేరిట ఉన్నాయి? కచ్చితంగా చెప్పే రికార్డు ఇది. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో భూ వివాదాలు పరిష్కారం పేరిట రీసర్వేకు శ్రీకారం చుట్టింది. అయితే రీసర్వేలో ఆర్‌వోఆర్‌కు బదులుగా బ్రిటీష్ కాలం నాటి ఆర్ఎస్ఆర్ రికార్డులను పరిగణలోకి తీసు కోవడం, గ్రామ సచివాలయ సర్వేయర్లకు రీసర్వేపై సరైన అవగాహన లేకపోవడం వెరసి తప్పుల తడకగా మారింది. ముఖ్యంగా దశాబ్దాల కాలంగా అమలులో ఉన్న సర్వే నంబర్ల స్థానంలో జాయింట్ ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్‌పీఎం)లను తీసుకొచ్చారు. 118 ఏళ్ల నాటి ఆర్ఎస్ఆర్ రిజిస్టర్ ప్రకారం సర్వే నంబరు స్థానంలో జాయింట్ ఎల్‌పీఎం నంబరు ఇవ్వడంతో సమస్యలు తలెత్తా యి. ఉదాహరణకు.. నాడు ఓ రైతుకు ఓ సర్వే నంబరులో 25 ఎకరాలు ఉంటే, వారసత్వంగానో, క్రయవిక్రయాల వల్లనో ప్రస్తుతం ఐదారుగు రైతుల పేరిట మారింది. సబ్ డివిజన్ పరిగణలోకి తీసుకోకుండా మొత్తం 25 ఎకరాలకు ఓకే జాయింట్ ఎల్‌పీఎం నంబరు ఇచ్చారు. దీంతో భూమి లేకపోవడంతో పాటు ఉన్న ప్రభుత్వ పథకాలు సైతం అందకుండా పోతున్నాయి.

రికార్డులు సరి చేసేందుకు మామూళ్లు..!

రీసర్వే వల్ల తలెత్తిన సమస్యను పరిష్కరించమని బాధిత రైతులు వీఆర్‌ఓలు, గ్రామ సచివాలయ సర్వేయర్లు, తహసీల్దారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. చేసిన తప్పులు సరిచేయాల్సిన రెవెన్యూ అధికారులు ఇది తన పరిధిలో లేదు.. సబ్ కలెక్టర్/ఆర్డీఓ, జాయింట్ కలెక్టర్ (జేసీ) పరిధిలో ఉందంటూ కాలయాపన చేస్తున్నారు.

మిగతా 6వ పేజీలో

ఆందోళనలో బాధిత రైతులు

జిల్లాలో ఫేజ్-1 కింద 67 గ్రామాల్లో 1,25,260.98 ఎకరాలు, ఫేజ్-2 కింద 21 గ్రామాల్లో 73,060.05 ఎకరాలు, ఫేజ్-3 కింద 164 గ్రామాల్లో 5,37,180.28 ఎకరాలు కలిపి 252 గ్రామాల్లో 7,45,501.316 ఎకరాలు రీసర్వే చేశారు. 61,817 మంది రైతుల ఖాతాలకు 21,588 జాయింట్ ఎల్‌పీఎం నంబర్లు ఇచ్చారు. సర్వే నంబరు స్థానంలో జాయింట్ ఎల్‌పీఎం నంబర్లు తీసుకురావడం, ఐదారుగురు రైతుకు ఒకే ఎల్‌పీఎం నంబరు ఇవ్వడంతో సమస్యలు చుట్టిముట్టాయి. ఒక ఎల్‌పీఎం నంబరులో ఐదురుగురు రైతులకు 25 ఎకరాలు ఉంటే, ఏ రైతు పేరిట ఎంత భూమి ఉందో అంతే చూపాలి. ఇందుకు విరుద్ధంగా మొత్తం రైతులకు 25 ఎకరాలు చొప్పున వారి పేరిట చూపించడంతో అర్హులు కూడా సంక్షేమ పథకాలకు అనర్హులు అవుతున్నారు.

వైభవంగా ఉమామహేశ్వరస్వామి కల్యాణం



ఉమామహేశ్వర స్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

బనగానపల్లె, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి క్షేత్రంలో బుధవారం రాత్రి ఉమామహేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వ హించారు. ఆలయ ఈవో పాండురంగారెడ్డి, మౌళీశ్వరరెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఆలయ పూజారులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మాస శివరాత్రి సందర్భంగా ఈ కల్యాణం నిర్వహించారు. భక్తులు ఉమామహేశ్వర స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

పర్యాటకానికి గ్రహణం..! 6

- 2010లో అవుకు రిజర్వాయర్ నిర్మాణం
- రివర్‌వ్యూ రెస్టారెంట్ నిర్మాణం, బోటింగ్‌క్లబ్ ఏర్పాటు

3,500 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యం

ఉపాధి పీడీ సూర్యనారాయణ


మాట్లాడుతున్న ఉపాధిహామీ పీడీ సూర్యనారాయణ

చాగలమర్రి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో 3,500 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యంగా ఉందని ఉపాధి హామీ పీడీ సూర్యనారాయణ తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 2,500 ఎకరాల్లో పండ్ల తోటల సాగుకు రైతులు ముందుకు వచ్చారని అన్నారు. 100 శాతం సబ్సిడీతో మూడేళ్ల పాటు ఉపాధి నిధులు ఖర్చు చేశారన్నారు. పండ్ల తోటల సాగుతో రైతుల జీవనోపాధి పెరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పండ్ల తోటల సాగుకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. 800 మినీ గోకులాల షెడ్లు పూర్తయ్యాయన్నారు. కొత్తగా 600 మినీ గోకులాలు మంజూరైనట్లు తెలిపారు. గ్రామాల్లో 60 వేల కాంపోస్టు పిట్స్ లక్ష్యం ఉందని అన్నారు. ఉపాధి పనులు చేసే కూలీలకు ప్రభుత్వం రూ.307 కేటాయించిందని అన్నారు. ప్రస్తుతం కూలీలకు రూ.262 మాత్రమే పడుతుందని అన్నారు. 4.50 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయని అన్నారు. 45 లక్షల పనిదినాలు కల్పించామని అన్నారు. 17 మంది ఎఫ్‌లు, 7 మంది టీఏలకు షోకాజ్ నోటీసులు ఇచ్చామని, ఏడుగురు ఎఫ్ఏలను తొలగించామన్నారు. సామాజిక తనిఖీలో జరిగిన అవినీతి రూ.6.70 లక్షలకు గాను రూ.3.50 లక్షలు రికవరి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారిణి అన్వర్‌బేగం, ఏపీడీ సాంబశివరావు, హెచ్‌ఆర్ మేనేజర్ షిబా, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

పర్యాటకానికి గ్రహణం..!


రిజర్వాయర్ వద్ద నిర్మించిన పర్యాటక భవనం

అవుకు రిజర్వాయర్.. చుట్టూ ఎత్తైన కొండలు.. సహజ సిద్ధమైన పచ్చటి ప్రకృతి అందాలు.. ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య నిర్మితమైన ఈ రిజర్వాయర్ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఇక్కడి నుంచి కేవలం 13 కిలోమీటర్ల దూరంలోనే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన బెలుం గుహలు ఉన్నాయి. దీంతో అవుకు రిజర్వాయర్ అందాలు పర్యాటకులను విశేషంగా ఆకర్షించేవి. 2018లో రెస్టారెంట్ భవనాన్ని పూర్తిచేశారు. రిజర్వాయర్‌లో బోటింగ్ కూడా ఏర్పాటుచేయటంతో ప్రతిరోజు వందలాది మంది పర్యాటకుల రాకతో రెస్టారెంట్ భవనం కళకళలాడేది. రెండేళ్ల క్రితం జరిగిన ఓ దుర్ఘటనతో అవుకు రిజర్వాయర్ వద్ద పర్యాటకానికి గ్రహణం పట్టుకుంది. రెస్టారెంట్, బోటింగ్ పూర్తిగా మూసివేశారు. సీఎం చంద్రబాబునాయుడు పర్యాటకానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నా కొందరు అధికారుల నిర్లక్ష్యంతో ఆశయం నీరుగారిపోతుంది. రెస్టారెంట్ భవనానికి భద్రత కరువైంది. ఆకతాయిలు, మందుబాబులు రెస్టారెంట్ భవనాన్ని అడ్డాగా చేసుకొని అసాంఘిక కార్యకలాపాలకు తెరలేపారు.

అవుకు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అవుకు రిజర్వాయర్ వద్ద పర్యాటకానికి గ్రహణం పట్టుకుంది. 2010లో రిజర్వాయర్ 4.148 టీఎంసీలు నీటినిల్వ సామర్థ్యంతో ఈ రిజర్వాయర్‌ను నిర్మించారు. 2016లో సీఎంగా ఉన్న చంద్రబాబు నాయుడు 'పల్లెనిద్ర-నీరుచెట్టు' లో భాగంగా అవుకు రిజర్వాయర్‌లో అంతర్భాగమైన తిమ్మరాజు చెరువుకట్టపై రాత్రి బస చేశారు. నాటి బనగానపల్లె ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి రిజర్వాయర్ వద్ద బోటింగ్ క్లబ్ అండ్ రివర్‌వ్యూ రెస్టారెంట్ భవనాన్ని ఏర్పాటుచేసే విధంగా సీఎంను ఒప్పించారు. రూ.2కోట్లు నిధులు మంజూరు చేయించి 2018లో రెస్టారెంట్ భవనాన్ని పూర్తిచేశారు. రిజర్వాయర్‌లో బోటింగ్ కూడా ఏర్పాటుచేయటంతో ప్రతిరోజు వందలాది మంది పర్యాటకుల రాకతో రెస్టారెంట్ భవనం కళకళలాడేది. రెస్టారెంట్ భవనంలో విశ్రాంత గదులు ఏర్పాటు చేయటంతో దూరప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు బోటింగ్ చేసిన అనంతరం సేదతీరుతూ ప్రకృతి అందాలను చూసి ముగ్ధులయ్యేవారు. జిల్లాలో పర్యాటకశాఖ పరిధిలో ఉన్న వాటన్నింటినీ ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) నిర్వహిస్తుంటుంది. ఎక్కడాలేని విధంగా అవుకు రిజర్వాయర్ వద్ద ఏర్పాటుచేసిన రెస్టారెంట్, బోటింగ్‌ను ఏపీ పర్యాటకశాఖ నేరుగా టెండర్లు నిర్వహిం చి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించటం గమనార్హం. గతంలో నిర్వహించిన వ్యక్తులు తమకే కావాలని హైకోర్టును ఆశ్రయించటంతో టెండర్ల ప్రక్రియ ముగిసినా పునఃప్రారంభానికి నోచుకోలేదు.


కూలిపోయిన ముఖద్వారం


దుండగులు అపహరించుకుపోయిన కిటికీలు

- 2010లో అవుకు రిజర్వాయర్ నిర్మాణం
- రివర్‌వ్యూ రెస్టారెంట్ నిర్మాణం, బోటింగ్‌క్లబ్ ఏర్పాటు
- 2023లో బోటింగ్ చేస్తూ ముగ్గురి మృతి
- వైసీపీ హయాంలో మూసివేత
- శిథిలావస్థకు చేరిన భవనాలు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం

నిబంధనలు గాలికొదిలేసి..

4.148 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంతో నిండు కుండలా ఉన్న రిజర్వాయర్‌లో బోటింగ్ నిర్వహణ ఆషామాషీ కాదు. అప్పట్లో నిర్వాహకులు నిబంధనలు గాలికి వదిలేసినట్లు విమర్శలున్నాయి. 2023 మే నెల 14న బోటింగ్ ప్రమాదంలో ముగ్గురు మహిళలు ప్రాణా లు కోల్పోయారు. అప్పట్లో కోవెలకుంట్ల ఎస్‌బీ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రసూల్‌బాషా 14మంది కుటుంబ సభ్యులతో రిజర్వాయర్‌లో విహారయాత్రకు వచ్చాడు. రిజర్వాయర్‌లో బోటులో విహరిస్తుండగా అరకిలోమీటరు వెళ్లగానే బోటు బోల్తాపడింది. కుటుంబ సభ్యుల్లో హసియా, నూర్జాహాన్ మృతి చెందారు. రసూల్ కుమార్తె సాజిదా రిజర్వాయర్‌లో గల్లంతైంది. మరుసటి రోజు మృతదేహాన్ని బయటకు తీశారు. ఇలా బోటు ప్రమాదంలో ముగ్గురు మహిళలు మృతి చెందగా, 11 మంది ప్రాణాలతో బయట పడ్డారు. ఈ ఘటనతో అప్పటి వైసీపీ ప్రభుత్వం బోటింగ్‌తో పాటు రెస్టారెంట్ భవనాన్ని మూసివేశారు.

నాడు కళకళ - నేడు వెలవెల

గతంలో ఇక్కడికి వచ్చే పర్యాటకుల సంఖ్య శని, ఆది వారాలతో పాటు ఇతర సెలవు దినాల్లో అధికంగా ఉండేది. రోజురోజుకు పర్యాటకుల సంఖ్య పెరగటంతో నిర్వాహ కులు స్పీడుబోటు, పెడల్‌బోటు, ఫ్యామిలీబోటు లాంటి పలు రకాల బోట్లను అందుబాటులో ఉంచి సొమ్ము చేసుకొనే వారు. రెండేళ్ల క్రితం రిజర్వా యర్‌లో బోటు బోల్తా పడి ముగ్గురు మహిళలు మృతి చెందటంతో మూసివేతకు గురై నేడు వెలవెలబోతోంది. ఆనాటి నుంచి ఆలనా పాలనా కరువై భవనం శిథిలావస్థకు చేరుకుంటుంది.


ప్రమాదానికి గురైన బోటు (ఫైల్)

భద్రత కరువు

ప్రమాదం జరిగిన రోజునుంచి మూసివేతకు గురైన రెస్టారెంట్ భవనానికి పర్యాటక శాఖ అధికారులు భద్రత కల్పించాల్సి ఉన్నా పట్టించుకోలేదు. ఇదే అదనుగా భావించిన ఆకతాయిలు, మందుబాబులు రెస్టారెంట్ భవనాన్ని అడ్డాగా చేసుకొని అసాంఘిక కార్యకలాపాలకు తెరలేపారు. భవనంలోని వాకిళ్లకు ఉన్న అద్దాలను ధ్వంసం చేసి కిటికీలు, తలుపులను అపహరించుక పో యారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని రెస్టారెంట్‌తో పాటు బోటింగ్‌ను తిరిగి ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కార్పొరేషన్‌కు అప్పగించాలి



అవుకు రిజర్వాయర్ వద్ద నిర్మించిన పర్యాటక భవనాన్ని పర్యాటకశాఖ నేరుగా టెండర్లు నిర్వహించి ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వటం సరికాదు. అవుకు రిజర్వాయర్‌వద్ద ఏర్పాటుచేసిన రెస్టారెంట్ భవనంతో పాటు బోటింగ్‌ను ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అప్పగించాలి.

● రామకృష్ణ,ఏపీటీడీసీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

సిబ్బంది కొరతతో భద్రత..



అవుకు రిజర్వాయర్ వద్ద మూసివేతకు గురైన రెస్టారెంట్ భవనానికి సిబ్బంది కొరత కారణంగా భద్రత కల్పించలేకపోయిన మాట వాస్తవమే. భవనంలోని వస్తువులన్నింటినీ ధ్వంసం చేశారు. పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

● సత్యనారాయణ, పర్యాటకశాఖ ఇన్‌చార్జి డీటీవో, నంద్యాల

స్విమ్మింగ్ క్రీడాకారులకు కలెక్టర్ అభినందన

కర్నూలు స్పోర్ట్స్, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో ప్రతిభ కనబరిచిన జాతీయ స్థాయికి ఎంపికైన కర్నూలు జిల్లా క్రీడాకారులను కలెక్టర్ పి.రంజిత్ బాషా అభినందించారు. బుధవారం కలెక్టర్ చాంబరులో కలెక్టర్‌ను కలిసిన క్రీడాకారులు దేవసృత్ సాయి, భువనాదిత్య, హేమ లత, శృతిలకు పతకాలు, సర్టిఫికెట్లు, ట్రోఫీని కలెక్టర్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో భూపతిరావు, స్విమ్మింగ్ కోచ్ నటరాజ్, కర్నూలు డిస్ట్రిక్ట్ అక్వాటిక్ అసోసియేషన్ కార్యదర్శి రామకృష్ణ యాదవ్, కోశాధికారి దస్తగిరి, ఆర్గనైజింగ్ కార్యదర్శి అజయ్, జాయింట్ సెక్రటరీలు శివరాజ్, రామకృష్ణ పాల్గొన్నారు.


స్విమ్మింగ్ క్రీడాకారులతో కలెక్టర్ రంజిత్ బాషా

జింకల్లోలం

- పచ్చని పంటలపై దాడులు
- వేసిన మొక్కను వేసినట్లు తినేస్తూ..
- కర్షకులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తూ...
- ప్రతిపాదనలకే పరిమితమైన జింకల పార్కు
- ఏటా వేల ఎకరాల్లో నష్టపోతున్న రైతులు

చూడ ముచ్చటైన అందంతో చెంగుచెంగున జింకలు గంతులేస్తుంటే ఎంతో అందంగా ఉంటుంది. పచ్చని అడవుల్లో అవి పరిగెడుతుంటే ఎంతటి వారైనా వాటి విన్యాసాలకు మంత్ర ముగ్ధులవ్వాల్సిందే. అలాంటి కనువిందు చేసే కృష్ణజింకలే రైతుల పాలిట శాపంగా మారాయి. పంటలపై దాడి చేస్తూ కర్షకులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఆరుగాలం రైతులు శ్రమించి పండించిన పంటలను జింకలు నాశనం చేస్తున్నాయి. ఒక్కో గుంపులో 50నుంచి 500 జింకలు వచ్చి పొలాలపై దాడి చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. రాత్రింబవళ్లు కష్టపడి పంటలను కాపాడుకుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం స్పందించి జింకల పార్కును ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆదోని, జూలై23(ఆంధ్రజ్యోతి): ఆదోని డివిజన్‌లోని ఆదోని, ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హొళగుంద, హాలహర్వి, కౌతాళం మండలాల్లో జింకల బెడద అధికమైంది. నల్లరేగడి పొలాలు కావడం, తుంగభద్ర దిగువ కాలువ ఉండడంతో నీళ్లు సమృద్ధిగా దొరుకుతుండడంతో జింకల సంతతి భారీగా పెరిగిపోయింది. పంట వేసినప్పటి నుంచి చేతికొచ్చే వరకు పొలాల దగ్గర కాపలా కాసినా కానీ ఒక్కసారిగా జింకలు పంటలపై మెరుపు దాడి చేసి నాశనం చేస్తున్నాయని కర్షకులు ఆవేదన చెందుతున్నారు. కంటి మీద కునుకు లేకుండా రాత్రింబవళ్లు పొలాల గట్లపై కాపలా కాస్తూ పంటలను కాపాడుకుంటున్నామ న్నారు. ఆదోని, ఆలూరు నియోజకవర్గాల్లో జింకల సంతతి 10వేల వరకు ఉంటుందని అంచనా. జింకలను నియంత్రించే పనిలో ప్రభుత్వాలు సరైన చర్యలు తీసుకోకపోవడం వల్ల వీటి ఆవాసం పూర్తిస్థాయిలో పెరిగి రైతులను ఇబ్బందుల పాలు చేస్తున్నాయి.

జింకల పార్కు ఏర్పాటుకు హామీ..

2014లో కర్నూలులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జింకల పార్కు ఏర్పాటుకు అప్పటి సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఆ తర్వాత యేడాది ఆలూరు నియోజకవర్గం హొళగుంద మండలంలోని దేవరగట్టు ప్రాంతంలో జింకల పార్కు ఏర్పా టుకు 250ఎకరాల భూమిని సర్వే చేశారు. దీనికోసం గతంలో రూ.53.26 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. అటవీశాఖ అధికారులు తుంగభద్ర రిజర్వ్ ఫారెస్టు ప్రాంతంలోని 35, 36, 37 బీట్ కంపార్ట్‌మెంట్‌లో 12అడుగుల ఎత్తులో కంచె వేయాలని నిర్ణయించారు. దీనికోసం రూ.29.65 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. పార్కు ఏర్పాటు చేస్తే రూ.14.72 కోట్లు అవుతుందని, ఐదేళ్లపాటు జింకల నిర్వహణకు రూ.29.65 కోట్లు ఖర్చుఅవుతుందని ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం జింకల పార్కు దృష్టి సారించలేదు. అప్పటి కార్మిక శాఖ మంత్రిగా ఉన్న గుమ్మనూరు జయరాం కూడా పార్కు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ కూడా ఆచరణకు నోచుకోలేదు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడంతో జింకల పార్కు ఏర్పాటుచేయాలని రైతులు కోరుతున్నారు.

పత్తి పంటపై మందలుగా వచ్చి...

వానాకాలం సీజన్‌లో రైతులు చాలామంది పత్తి, కంది పంటపైపే మొగ్గుచూపుతున్నారు. వేలల్లో పెట్టుబడులు పెట్టారు. పంటలు మొలకదశలో ఉన్నప్పుడు మందలుగా వచ్చి పొలాలపై దాడి చేస్తున్నాయి. దీంతో పంటలు మొదటి దశలోనే ధ్వంసమైపోతున్నాయి. పత్తి కాయలను, కంది బుడ్డలను సైతం వదలడం లేదు అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కసారి జింకల మంద ఆ పొలంపై పడిందంటే ఆ సంబంధిత రైతులు నష్టాలపాలు కావాల్సిందే. మొలకదశలో తినడం,

రకరకాల శబ్దాలు చేయడంతో పాటు..

రైతులు ఉదయం మొదలుకుని చీకటిపడే వరకూ పంట పొలాల వద్ద కాపలా ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయి. జింకలు రాకుండా ఉండేందుకు పంటల వద్ద రకరకాల శబ్దాలు చేయడంతో పాటు రైతులే స్వయంగా మరి కొన్నిచోట్ల అరుపులు చేస్తూ, తమ పంటకు కాపలాగా ఉంటున్నారు.

పంటలు కాపాడాలి



ఆదోని డివిజన్‌లోని ప్రతి గ్రామంలో అధికంగా జింకలు గుంపులు గుంపులుగా ఉన్నాయి. ఒక్కసారి పొలంలో పడితే పంట అంతా నాశనమే. సీఎం చంద్రబాబునాయుడు జింకల పార్కును ఏర్పాటుచేసి జింకల నుంచి పంటలను రక్షించాలి.

● వీరేష్‌యాదవ్, రైతు, మదిరె గ్రామం, ఆదోని మండలం

ఏమాత్రం ఆదమరిచినా కృష్ణ జింకలు పంట పొలాల్లో చేరి అన్నదాతల ఆశలను ఆవిరి చేస్తున్నాయి.


పగటి సమయాల్లో పంట పొలాల్లో సంచరిస్తున్న జింకలు

జింకలతో రూ.వేలల్లో నష్టపోతున్నాం



మొలక దశలోనే జింకలు పంటలను తినేస్తున్నాయి. దీంతో వేలాది రూపాయలు నష్టపోతూనే ఉన్నాం. గత యేడాది రెండు ఎకరాల్లో పత్తి పంటను వేశాను. విత్తనం వేసినప్పటి నుంచి కాపు వచ్చేంతవరకు జింకల బెడద నుంచి కాపాడుకునేందుకు రాత్రి, పగలు కాపలా కాశాం. జింకలు గుంపులుగా వచ్చి పంటను తిని నాశనం చేశాయి.

- వీరేష్, రైతు, మదిరె గ్రామం, ఆదోని మండలం

రాత్రింబవళ్లు పొలాల్లోనే ఉండాల్సిన..



పంటలను జింకల నుంచి కాపాడుకోవడానికి రాత్రింబవళ్లు పొలాల్లోనే ఉండాల్సిన పరిస్థితి. అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డి, ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు కూడా జింకల పార్కు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు అమలు కాలేదు.

● మహాదేవప్ప, చాగి గ్రామం, ఆదోని మండలం


రాత్రివేళల్లో పంట పొలాల్లో జింకలు

పరిహారం అందించేందుకు చర్యలు

ప్రస్తుతం తుంగభద్ర ప్రాంతంలో జింకలు తినేందుకు ప్రత్యేకంగా పంటలు పండిస్తున్నాం. జింకల వల్ల పంటలు నష్టపోయిన రైతులు, మండల వ్యవసాయాధికారి ద్వారా పంట నష్టపోయినట్లు ధ్రువీకరణ పత్రం తెచ్చి ఇస్తే దానిని ప్రభుత్వానికి పంపుతాం. అటవీ శాఖ ద్వారా పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటాం. ● తేజస్విని, ఫారెస్ట్ రేంజ్ అధికారిణి, ఆదోని

జగన్ పాపం.. రైతులకు శాపం..!

(5వ పేజీ తరువాయి)

కుటుంబ అవసరాల కోసం భూములు అమ్ముకున్న భూములకు రిజిస్ట్రేషన్లు జరగక, అధికారుల తప్పిదం వల్ల ఎక్కువ భూమి చూపిచడంతో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ.. వంటి సంక్షేమ పథకాల వర్తించక న్యాయం కోసం ఆఫీసులకు వెళ్తే.. ఇదే అదనుగా వేలు, లక్షల రూపాయలు ఇవ్వాలంటూ లంచం రూపంలో డిమాండ్ చేస్తున్నారు. జగన్ ప్రభుత్వంలో రీసర్వే సమస్యలు తలెత్తాయి. కూటమి ప్రభుత్వం వస్తే ఈ కష్టాలు తీరుతాయని భావిస్తే, ఏడాది గడిచినా కష్టాలు కన్నీళ్లు పెట్టిస్తున్నాయే తప్పా పరిష్కారం చేయడం లేదు.


కోడుమూరుతహసీల్దారు కార్యాలయం

పాలకుల పాపాలు.. పథకాలకు శాపాలు..

రీసర్వేలో జరిగిన లోపాల వల్ల రైతులు సంక్షేమ పథకాలకు దూరం అవుతున్నారు. లేని భూమిని ఉన్నట్లు రికార్డుల్లో చూపడంతో జిల్లాలో దాదాపు 45 వేల మందికి పైగా 'తల్లికి వందనం' సాయం అందక ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. తాజాగా అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ యోజన సాయంపై కూడా అనుమానాలు ఉన్నాయి. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో 8.65 లక్షల మంది రైతులు ఉన్నారు. వారిలో అన్నదాత సుఖీభవకు 6.28 మందిని అర్హులుగా గుర్తించారు. మరో 2 లక్షల మంది అర్హత ఉన్నా వివిధ కారణాలతో పెండింగులో పెట్టారు. రీసర్వే లోపాల వల్లే ఈ పరిస్థితి వచ్చిందని, అన్నదాత సుఖీభవ సాయం రూ.20 వేలు కోల్పోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వాస్తవాలు కొన్ని

- కోడుమూరు మండలంలో ఐదు గ్రామాల్లో రీసర్వే చేశారు. జాయింట్ ఎల్‌పీఎం నంబర్లు వల్ల లేనిభూమిని ఉన్నట్లు చూపడం, కొలతల్లో తేడాలతో న్యాయం చేయాలంటూ 4,908 బాధితులు తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. సి.బెళగల్ మండలంలో రీసర్వే చేసిన గ్రామాల్లో 55-60 శాతం మంది రైతులు బాధితులే.
- ఆదోని మండలంలో 46 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. 28 గ్రామాల్లో రీసర్వే చేస్తే, జాయింట్ ఎల్‌పీఎం, భూమి కొలతల్లో తేడాలు వంటి సమస్యలతో 878 ఫిర్యాదులు చేశారు. 278 పరిష్కరించినట్లు అధికారులు చెబుతున్నారు. 600 సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. రికార్డులకు ఎక్కని ఫిర్యాదులు వేలల్లో ఉన్నాయని ఓ వీఆర్‌వో పేర్కొనడం కొసమెరుపు.
- ఎమ్మిగనూరు మండలంలో 20 రెవెన్యూ గ్రామాలు ఉంటే 16 గ్రామాల్లో రీసర్వే చేశారు. ఇక్కడ 274 ఫిర్యాదులు రాగా, 166 పరిష్కరించామని అధికారులు చెబుతున్నారు. వీఆర్‌వోలు, గ్రామ సచివాలయ సర్వేయర్ల వద్ద మగ్గుతున్న సమస్యలు రెట్టింపు ఉన్నాయని అంచనా.
- ఆలూరు మండలం తుంబబీడు, కమ్మరచేడు, ముద్దనగేరి, కురువల్లి, కరిడిగుడ్డం, మరకట్టు గ్రామాల్లో రీ సర్వే చేశారు. జాయింట్ ఎల్‌పీఎం సమస్యలతో 700 మంది రైతులు అన్నదాత సుఖీభవకు అనర్హులు అయ్యారు.
- రీసర్వే జరిగిన ప్రతి గ్రామంలోనూ ఇలాంటి సమస్యలే రైతులను వెంటాడుతున్నాయి. ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం నిర్వహించి రీసర్వే సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

31న జిల్లాస్థాయి యోగాసన పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి యోగాసన పోటీలు జూలై 31న కర్నూలు ఔట్ డోర్ స్టేడియంలోని యోగా హాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా యోగాసన అధ్యక్షుడు ఎస్‌వీ శివరాజు, కార్యదర్శి ప్రభాకర్ తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు రాష్ట్ర, జాతీయ, ఒలింపిక్స్‌లో పాల్గొనడానికి అర్హులన్నారు. ఈపోటీలు 10 నుంచి 55 సంవత్సరాల వయస్సు మహిళలు, పురుషులు పాల్గొనవచ్చని అన్నారు. ట్రెడిషనల్ యోగా, ఫార్వర్డ్ బెండ్, బ్యాక్ బెండ్, ట్విస్ట్, లెగ్ బాలెన్స్, హ్యాండ్‌బాలెన్స్, సుపినే, కళాత్మక సింగిల్, కళాత్మక పెయిర్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించబడునన్నారు. ప్రతి పోటీదారుడు తన వయస్సు బట్టి రెండు విభాగాల్లో మాత్రమే పోటీకి అనుమతించబడుతారని తెలిపారు. పోటీదారుడు తమతో పాటు తప్పనిసరిగా వయస్సు ధ్రువీకరణ, హెల్త్ సర్టిఫికెట్, ఫొటో, మెయిల్ ఐడీ, ఫోన్ నెంబర్, సెల్ఫ్‌డిక్లరేషన్, ఆధార్, రూ.50లు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని, వివరాలకు సెల్‌నెంబర్ 9949257657ను సంప్రదించాలని కోరారు.

లభ్యంకాని మహిళ ఆచూకీ


కుమ్మరి రాజేశ్వరి (ఫైల్)

ఆలూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలం మొలగవల్లి గ్రామానికి చెందిన మహిళ కుమ్మరి రాజేశ్వరి అదృశ్యమై 14 రోజులు గడిచినా ఆచూకీ లభించలేదు. తన భార్య కనిపంచడం లేదని ఈనెల 8న భర్త ఆదినారాయణ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ మహబూబ్‌బాషా బుధవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. కాగా బంధువులు ఓ ఉద్యోగి పాత్రపై అనుమానాలు వ్యక్తం చేయడంతో పోలీసులు సదరు ఉద్యోగిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 9121101158 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

మంత్రాలయం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం సమీపంలో తుంగభద్ర నది ఒడ్డున గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైందని మంత్రాలయం ఎస్‌ఐ శివాంజల్ తెలిపారు.



బుధవారం నది ఒడ్డున తుంగభద్ర నదిలో తేలియాడుతూ మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గజ ఈతగాళ్ల ఆర్డీఎఫ్ బృందం సాయంతో మృతదేహాన్ని ఒడ్డుకు తెచ్చారు. మహిళా మృతదేహం వద్ద ఎటువంటి ఆచూకీ తెలియలేదు. మృతురాలి వయసు 55ఏళ్ల దాకా ఉండవచ్చని, నలుపు ఆకుపచ్చని చీర, అదే రంగులో జాకెట్, ఎడమ ముక్కుపుడక, జత చెప్పులు ఉన్నట్లు తెలిపారు. వీఆర్వో భీమయ్య ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని మహిళా మృతదేహంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య

బనగానపల్లె, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటిపల్లె గ్రామానికి చెందిన బోయ శ్రీనివాసులు(34) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ దుగ్గిరెడ్డి బుధవారం తెలిపిన వివరాలివీ.. శ్రీనివాసులు మద్యానికి బానిస కావడంతో పాటు ఆటో కొనుగోలుకు చేసిన అప్పులు తీసుకొని చెల్లించలేక మనస్తాపంతో ఇంట్లో ఉరి వేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె వైద్యశాలకు తరలించారు. శ్రీనివాసులు తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైన్‌షాపులో చోరీ

కర్నూలు క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వైన్‌షాపులో చోరీ జరిగింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న పీఆర్ వైన్ షాపులో తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ముఖాలకు మాస్కులు ధరించి షాపులోకి చొరబడ్డారు. అనంతరం సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి విలువైన మద్యం బాటిళ్లు చోరీ చేశారు. నిందితుల ఆనవాళ్లు గుర్తు పట్టకుండా మాస్కులు ధరించడంతో పాటు చేతికి గ్లౌజులు వేసుకుని చోరీకి పాల్పడ్డారు. మద్యం దుకాణం నిర్వాహకుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మట్టిమిద్దె కూలి వృద్ధురాలి దుర్మరణం


అనుగొండ గ్రామంలో కూలిన మట్టిమిద్దె

కోడుమూరు రూరల్, జూలై 23, (ఆంధ్రజ్యోతి): మట్టిమిద్దె కూలి ఓ వృద్ధురాలు దుర్మరణం చెందింది. ఈ ఘటన మండలంలోని అనుగొండలో చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన బోయ గోవిందమ్మ(82) దివ్యాంగురాలు. గోవిందమ్మ కూతురు మాధలక్ష్మమ్మతో కలిసి నివసిస్తుంది. బుధవారం కుమార్తె తల్లికి భోజనం ఇచ్చి కూలీ పనికి వెళ్లింది. మధ్యాహ్నం రెండు గంటలకు వసారాలో పడుకున్న గోవిందమ్మపై మట్టిమిద్దె ఒక్కసారిగా కూలింది. ఇరుగుపొరుగు వారు అప్రమత్తమై పరుగున వచ్చి మట్టిని తొలగించి వెలికితీశారు. అప్పటికే గోవిందమ్మ మృతి చెందింది. విషయాన్ని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

అదనపు కట్నం కేసు నమోదు

ఆదోని, జూలై 23 (ఆంధ్రజ్యోతి): భర్త, అత్త అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్తపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ ఎస్‌ఐ రామస్వామి తెలిపారు. వివరాల మేరకు.. తనను వేధిస్తున్నట్లు ఎంఐజీ కాలనీకి చెందిన వర్షిత బుధవారం ఫిర్యాదు చేశారు. వర్షితకు బనగానపల్లె మండలం రామకృష్ణాపురంకు చెందిన సొంత అత్త కొడుకు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రదీప్‌కుమార్‌తో మూడేళ్ల క్రితం వివాహం చేశారు. వివాహ సమయంలో రూ.8 లక్షలతో పాటు 22 తులాల బంగారం ఇచ్చారు. రెండేళ్లు బాగానే ఉన్నారు. అయితే తాను బీటెక్ చదివి ఉద్యోగం చేయాలని వర్షిత పెళ్లికిముందే కోరడంతో అంగీకరించిన భర్త, అనంతరం ఒప్పుకోలేదు. అలాగే మరో రూ.4 లక్షలు అదనపు కట్నం తీసుకురావాలని, పొలం కూడా తనకు రాసివ్వా లని వేధించాడు. తనకు సంతానం కలగలేదంటూ రోజూ మానసికంగా హింసించడం తోపాటు, దాడి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. ఇప్పటికే ఓసారి వర్షిత ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌లో కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు. అయినా భర్తలో మార్పు రాకపోవడంతో అక్కడి పోలీసుల సూచన మేరకు ఆదోనిలో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు భర్త ప్రదీప్‌కుమార్‌పై వరకట్నపు వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టీడీపీ నాయకుడిపై దాడి

నంద్యాల టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నంద్యాల 38వ వార్డు వైఎస్సార్ నగర్‌కు చెందిన టీడీపీ నాయకుడు ప్రసాదరెడ్డిపై గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. ప్రసాదరెడ్డి ఇంట్లో ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు రాడ్లతో దాడి చేశారు. గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సౌకర్యాలను వినియోగించుకోవాలి


ఆదోనిలో మాట్లాడుతున్న డీఈవో శామ్యూల్ పాల్

ఆదోని అగ్రికల్చర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను వినియోగించుకోవాలని డీఈవో శామ్యూల్ పాల్ సూచించారు. బుధవారం రాత్రి పట్టణంలోని కస్తూర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడారు. అనంతరం పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం మెరుగుపడేలా విద్యాబోధన చేయాలని, మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. కోట్లనగర్ కేజీబీవీ జనరల్, వైఎస్ఆర్ నగర్ కేజీబీవీ మైనార్టీ విద్యాలయాల్లో సౌకర్యాలపై భోజనంపై డీఈవో సంతృప్తి వ్యక్తం చేశారు.

జీడీపీకి నీటి విడుదల చేయండి


చిన్నటేకూరు వద్ద హెచ్ఎన్ఎస్ఎస్ కాల్వలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా. అంగన్‌వాడీ కేంద్రంలో ఆహారాన్ని పరిశీలిస్తూ..

- హంద్రీనీవా నీటితో 68చెరువులను నింపాలి
- కలెక్టర్ రంజిత్ బాషా
- హెచ్ఎన్ఎస్ఎస్ విస్తరణ పనుల పరిశీలన

కల్లూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరానికి నీటి సమస్య తలెత్తకుండా హెచ్ఎన్ఎస్ఎస్(హంద్రీనీవా సుజల స్రవంతి) నుంచి నీరు విడుదల అవుతున్న సమయంలోనే గాజులదిన్నె ప్రాజెక్టు(జీడీపీ)కి నీటిని విడుదల చేయాలని కలెక్టర్ రంజిత్‌బాషా ఇరిగేషన్ శాఖ డీఈని ఆదేశించారు. బుధవారం కల్లూరు మండలం చిన్నటేకూరు వద్ద హంద్రీనీవా విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీటి ప్రవాహం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా హంద్రీనీవా నీటితో 68 చెరువులను కూడా నింపే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కాలువ వెంబడి ఉన్నటువంటి కృష్ణగిరి రిజర్వాయర్, పత్తికొండ రిజర్వాయర్‌లతో పాటు అన్ని తూముల ద్వారా ఆయకట్టుకు నీటిని ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఇన్‌చార్జ్ ఈఈ ప్రసాదరావు, డీఈ కొండన్న, చెన్నయ్య, కల్లూరు తహసీల్దారు కె.అంజనేయులు పాల్గొన్నారు.

గర్భిణులు, పిల్లలు, బాలింతల..

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, పిల్లలు, బాలింతల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ రంజిత్ బాషా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులను ఆదేశించారు. చిన్నటేకూరులో అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. వండిన భోజనాన్ని పరిశీలించారు. ఐసీడీఎస్ పీడీ నిర్మల ఉన్నారు.

రిటైర్డ్ సీటీవో చేతివాటం

- కొడుకుతో కలసి రోడ్డుపై అక్రమ వసూళ్లు
- కేసు నమోదు చేసిన ప్యాపిలి పోలీసులు


పోలీసుల అదుపులో నిందితులు, ఉపయోగించిన కారు

ప్యాపిలి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆయనో రిటైర్డ్ సీటీవో (కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్). ఉన్నతమైన ఉద్యోగం చేసి సంతోషంగా ఉండాల్సిన ఆయనకు ఇంకా డబ్బుపై ఆశ పోలేదు. ఉద్యోగ సమయంలో అలవాటు కాబోలు పదవీవిరమణ పొందినా రోడ్డుపై నిలబడి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడు. అది కూడా కుమారుడితో కలసి చేతివాటం ప్రదర్శించడం గమనార్హం. అక్రమ వసూళ్ల సమాచారం తెలుసుకున్న పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా... కర్నూలుకు చెందిన సుబ్బరాయుడు కమర్షియల్ ట్యాక్స్ అధికారిగా పనిచేస్తూ గత ఏడాది రిటైర్డ్ అయ్యాడు. అయితే సదరు అధికారి రిటైర్డ్ అయినా అక్రమ వసూళ్లను ఆపలేదు. కొన్ని నెలలుగా తన కొడుకు సురేష్‌తో కలసి డోన్, ప్యాపిలి, వెల్దుర్తి హైవేపై వాహనాలను ఆపి తాను కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ అని చెప్పి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడు. ప్రభుత్వ అధికారులు ఉపయోగించే అంబాసిడర్ కారులో వెళ్లి తన వద్ద ఉన్న పాత ఐడీ కార్డులతో దోపిడికి తెరలేపాడు. వారంలో ఒక్కోరోజు ఓ ప్రాంతంలోని హైవేపై ఈ వసూళ్లకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

నిందితులు పట్టిబడిందిలా..

ప్యాపిలి సమీపంలోని పెద్దమ్మడాబా దగ్గర బుధవారం రిటైర్డ్ సీటీవో సుబ్బరాయుడు, ఆయన కొడుకు సురేష్ కలిసి వాహనాలు నిలిపి వాహనదారుల నుంచి డబ్బు డిమాండ్ చేశారు. అదే సమయంలో డోన్ వెహికల్ అండ్ మోటారు ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ కూడా కొంతదూరంలో రోడ్డుపై వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ప్రతి వాహనాన్ని నిలిపి వసూళ్లకు పాల్పడటాన్ని గమనించిన ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్‌కు అనుమానం వచ్చి వారి దగ్గరకు వెళ్లారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారి వివరాలను అడిగాడు. తాను సీటీవో అని సుబ్బరాయుడు గుర్తింపుకార్డు చూపించారు. అయితే వారి మాటల్లో తడబాటును గమనించిన క్రాంతికుమార్‌కు అనుమానం వచ్చింది. వెంటనే తమ సిబ్బంది సాయంతో నిందితులను ప్యాపిలి పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. పోలీసుల విచారణలో తండ్రి, కొడుకుల అక్రమ వసూళ్ల బాగోతం బయటపడింది.

తండ్రీకొడుకులపై కేసు నమోదు

అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న తండ్రి సుబ్బరాయుడు, కొడుకు సురేష్‌తో పాటు కారు డ్రైవర్ అక్షయ్‌పై కేసు నమోదు చేసినట్లు ప్యాపిలి ఎస్‌ఐ మదుసూధన్ తెలిపారు. డోన్ వెహికల్ అండ్ మోటారు ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వీరి అక్రమాలపై మరింత పూర్తి విచారణ చేస్తామని ఎస్‌ఐ మధుసూధన్ వెల్లడించారు.

విద్యార్థుల మధ్య ఘర్షణ

- ఓ స్టూడెంట్‌కు విరిగిన కాలు


కాలు విరిగిన విద్యార్థి కార్తీక్

అవుకు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లె గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలో తొమ్మిదో తరగతి విద్యార్థి కార్తీక్ ఎడమకాలు విరిగింది. వివరాలివీ.. ఈనెల 21న విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆడుకుంటుండగా కార్తీక్, మరో విద్యార్థి మధ్య ఘర్షణ తలెత్తింది. దీన్ని గమనించిన మరో విద్యార్థి సోదరుడు, పలువురు కలిసి కార్తీక్‌పై దాడి చేశారు. ఈ ఘర్షణలో కార్తీక్ ఎడమకాలు విరిగి కుప్పకూలిపోయాడు. బాధిత విద్యార్థి తల్లిదండ్రులు అంకన్న, లక్ష్మీదేవి పాఠశాల వద్దకు చేరుకొని పాఠశాల ఆవరణలో విద్యార్థుల మధ్య ఘర్షణ జరుగుతున్నా అడ్డుకోకపోవటం ఏమిటని ఉపాధ్యాయులను నిలదీశారు. కనీసం నడవలేని స్థితిలో ఉన్న కార్తీక్‌ను ఉపాధ్యాయులు 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించకపోవటం దారుణమని అమన్నారు. తాడిపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎక్స్‌రే ద్వారా పరీక్షించగా ఎడమ కాలు విరిగినట్లు తేలింది. కాలుకు కట్టుకట్టించి ఇంటికి తీసుకొచ్చారు. ఘటన జరిగిన సమయంలో హెచ్ఎం రామస్వామి పాఠశాలలో లేనని, అవుకు ఎంఆర్‌సీ కార్యాలయానికి పని నిమిత్తం వెళ్లినట్లు చెప్పి జారుకున్నారు. నంద్యాల డీఈవో జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎంఈవోలు శ్రీధర్‌రావు, వెంకటేశ్వరరెడ్డి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను పిలిచి విచారణ చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

హైరిస్క్ కేసులుంటే వెంటనే స్పందించాలి


సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో పి.శాంతికళ

- డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు హాస్పిటల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గర్భవతులు హైరిస్క్‌గా గుర్తించినట్లయితే ఆశా, ఆరోగ్య కార్యకర్తలు వెంటనే స్పందించి ఆసుపత్రుల్లో చేర్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ ఆదేశించారు. బుధవారం ముజఫర్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో జూన్ నెలలో సంభవించిన మాతృ మరణంపై కర్నూలు డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలోని సిబ్బంది ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, వైద్యాధికారులు గర్భవతులను త్వరగా గుర్తించి వారికి సరైన సమయంలో వైద్యసేవలు అందించినట్లు అయితే తల్లుల మరణాలను తగ్గించవచ్చని అన్నారు. సమీక్షలో డీఐవో డా.నాగప్రసాద్‌బాబు, డీసీహెచ్ఎస్ డా.జఫ్రుల్లా, డీపీఎంవో డా.ఉమా, కర్నూలు జీజీహెచ్ గైనకాలజీ హెచ్‌వోడీ డా.సావిత్రి, అనస్థీషియా ప్రొఫెసర్ డా.రామశివనాయక్, డీపీహెచ్ఎన్‌వో అన్నపూపర్ణ, యూపీహెచ్‌సీ వైద్యాధికారులు సుప్రి, డా.జ్యోతి పాల్గొన్నారు.

మాజీ ఎంపీపై అనుచిత వ్యాఖ్యలు

- నిందితులు అరెస్టు

కర్నూలు క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా రూ.3 కోట్లు డిమాండ్ చేసిన నిందితులను టూటౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ నాగరాజురావు తెలిపారు. వివరాలు.. ఒంగోలుకు చెందిన నాగాంజనేయులు, తిరుపతికి చెందిన సత్యనారాయణ, కొంగూరు మహేష్ తిరుపతిలో సీతమ్మ ఆర్యవైశ్య ధర్మసత్రం చెందిన భూములను నిందితులు కాజేయాలని చూశారు. ఆ స్థలంలో షాపులో దుకాణాలు నిర్మించి లీజుకు ఇస్తామని నమ్మించారు. పలువురి నుంచి రూ.6కోట్ల మేర వసూలు చేశారు. దీంతో ఆ ట్రస్టు ట్రెజరర్‌గా ఉన్న కర్నూలుకు చెందిన ఇల్లూరు లక్ష్మయ్య నుంచి రెండుసార్లు రూ.2.5 లక్షలు వసూలు చేశారు. ఆక్రమించిన భూములను ట్రస్టు నిర్వాహకులు స్వాధీనం చేసుకునే ప్రయత్నించారు. ఆ భూములను వదిలిపెట్టాలంటే రూ.3కోట్లు డిమాండ్ చేసినట్లు బాధితుడు లక్ష్మయ్య ఫిర్యాదు చేశారు. నిందితులు మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ నుంచి రూ.10 లక్షలు డిమాండ్ చేయగా ఆయన నిరాకరించారు. దీంతో టీజీ వెంకటేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఫేస్‌బుక్, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

విభజన హామీలను తుంగలో తొక్కిన కేంద్రం

- రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి


ఆళ్లగడ్డలో మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి

ఆళ్లగడ్డ, జూలై 23(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డీఏ ప్రభుత్వం విభజన చట్టం హామీలను తుంగలో తొక్కిందని రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి విమర్శించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇవ్వాల్సింది కొండంత అయితే ఇచ్చింది గోరంత మాత్రమే అని అన్నారు. విభజన చట్టంలోని పోలవరాన్ని పూర్తి చేయలేదన్నారు. తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం నగరాలలోని విమానాశ్రయాలను అంతర్జాతీయ విమానాశ్రయాలుగా తీర్చిదిద్దుతామని చెప్పి విస్మరించారన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ.. టీడీపీ ఎంపీల మద్దతునే ఉందని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ తాలుకా సమన్వయకర్త హుస్సేన్‌బాషా, మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి శంషుల్‌హక్, డాక్టర్ వెస్లీ, సంజయ్‌కుమార్, మౌలానా అబ్దుల్ మజీద్ తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె: భాగవత సప్తాహం మోక్షప్రాప్తికి సోపానం అని మాజీ ఎంపీ తులసిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటిలో నిర్వహించిన భాగవతసప్తాహం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కంచిరెడ్డి, నారాయణరెడ్డి, బాలకృష్ణారెడ్డి, నరింహులు, బాలుయాదవ్, హుస్సేన్, శ్రీనివాసులు, అమర్, ఉత్తన్న, సుబ్బారెడ్డి, రాజు, బాబా తదితరులు పాల్గొన్నారు.

రహదారుల సమస్యలను పరిష్కరించండి


కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సమస్యలు వివరిస్తున్న ఎంపీ

నంద్యాల రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జాతీయ రహదారుల సమస్యలను పరిష్కరించాలని కేంద్ర రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి కోరారు. ఈ మేరకు బుధవారం డిల్లీలోని కేంద్ర మంత్రి కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా దేశ రాజధాని డిల్లీలో టీడీపీ కార్యాలయ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ కట్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

చీటింగ్ కేసులో ఇద్దరికి జైలు, జరిమానా

కర్నూలు లీగల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే.. అధిక మొత్తంలో వడ్డీ ఇస్తామని చెప్పి ఫిర్యాదిని నమ్మించి మోసం చేసిన కేసులో ఇద్దరు నిందితులకు ఏడాది జైలు, రూ.10వేలు జరిమానా విధిస్తూ కర్నూలు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్.అనిల్ కుమార్ బుధవారం తీర్పు చెప్పారు. స్థానిక కల్లూరుకు చెందిన ఇద్దరు నిందితులు రవికుమార్, ఉరుకుందులు కలిసి 2012 అక్టోబరు 3వ తేదీన స్థానిక ఏ.క్యాంపు చెందిన ఆరేపల్లి శైలజను కలిసి షేర్ మార్కెటింగ్ నందు పెట్టుబడి పెట్టించారు. ఆ తర్వాత నిందితుల పేర్ల మీద సెక్యూరిటీ అకౌంటు ఓపెన్ చేసి అందులో ఫిర్యాదితో రూ.10 లక్షలు పెట్టుబడి పెట్టించారు. ఆ తర్వాత ముద్దాయిలు ఆ సెక్యూరిటీ అకౌంటును క్లోజ్ చేసి ఆ డబ్బును నిందితులు తన సొంతానికి వాడుకున్నారు. ఆ తర్వాత తాను మోసపోయాననీ తెలుసుకున్న ఫిర్యాది స్థానిక రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందతులపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. నిందితులపై నేరం రుజువు కావడంతో ఒక ఏడాది జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

జల్‌జీవన్ పనుల పరిశీలన



పనులపై ఆరా తీస్తున్న ప్రత్యేకాధికారి

ఆత్మకూరురూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): శ్రీపతిరావుపేట, బాపనంతాపురం, కొత్తరామాపురం గ్రామాల్లో జల్ జీవన్ ద్వారా జరిగిన పనులను ఢిల్లీ నుంచి విచ్చేసిన ప్రత్యేక అధికారి నేషనల్ వాష్ ఎక్స్‌పర్ట్ సరోజిత్ సఖియా బుధవారం పరిశీలించారు. డివిజన్‌లోని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఎంపీడీవో సయ్యద్ ఉమ్మర్‌తో ఓహెచ్ ఎస్ఆర్ ట్యాంకులను, జీఎల్ఎస్ఆర్ ట్యాంకులను, వ్యక్తిగత మరుగు దొడ్లను పరిశీలించారు. తాగునీటి ట్యాంకుల పరిశుభ్రతను, నాణ్యతను పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు ఉమాకాంత్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఏఈ పక్కీరయ్య, జిల్లా ఎస్‌బీఎం విజయ్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో బాలునాయక్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ శానిటేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే కూలీల సమస్యలపై ప్రస్తావిస్తా: ఎంపీ



ఎంపీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నంద్యాల రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా రైల్వే సంస్థ పై ఆధారపడిన కూలీల సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి హామీ ఇచ్చారు. బుధవారం ఢిల్లీలో నేషనల్ పోర్టర్ ఫ్రంట్ (కూలీ సంఘం) నాయకులు ఎంపీకి వినతి పత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా రైల్వే కూలీల కష్టాల గురించి, ప్రైవేటీకరణ, ఆధునికీకరణతో ఆదాయ మార్గాలు తగ్గిపోవడం, సురక్షిత జీవనాధారాలు వంటి సమస్యలు ఏర్పడ్డాయన్నారు.

తాగునీటి పథకాలకు రూ.16.5 లక్షలు మంజూరు: డీఈ



జానాలగూడెంలో పైపులైన్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన గూడెల్లో శుద్ధ జలాలు అందించేందుకు ప్రభుత్వం రూ.16.5 లక్షల నిధులు మంజూరు చేసినట్లు నందికొట్కూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కొత్తపల్లి మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జుబేర్, సర్పంచ్ బాల ఎల్లయ్యతో కలిసి మండలంలోని సంగమేశ్వరం, జానాలగూడెం, బలపాలతిప్ప, సిద్దేశ్వరం గ్రామాల్లో తాగునీటి పథకాల కోసం స్థలాలను పరిశీలించారు. పది రోజుల్లో పనులు ప్రారంభించి ఈ గ్రామాలకు శుద్ధ జలాలు అందించనున్నట్లు డీఈ తెలిపారు. డీఈ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సంగమేశ్వరంలో స్వచ్ఛభారత్ మిషన్ కింద రూ.3 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో భక్తులకు రెండు మరుగుదొడ్లు, నీటి సౌకర్యం కోసం ట్యాంకులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే జానాల గూడెంలో జల్‌జీవన్ మిషన్ కింద రూ.6 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ గూడెంలో పైపులైన్ నిర్మాణంతో పాటు 40 ఇళ్లకు కొళాయి కనెక్షన్లు కూడా ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే బలపాలతిప్పలో కూడా రూ.4.50 లక్షల నిధులు కూడా మంజూరు కాగా, అక్కడ కూడా పైపుల నిర్మాణం 40 ఇళ్లకు కొళాయి కనెక్షన్లు ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే సిద్దేశ్వరం కూడా రూ.3 లక్షల నిధులు మంజూరు కాగా, అక్కడ కూడా పైపులైన్ నిర్మాణం, ఇంటింటికి కొళాయి కనెక్షన్లు కూడా ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నందికొట్కూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అందజేశారు. పట్టణానికి చెందిన షేక్ రమిజాబికి (రూ.73,752), మొల్ల అయాన్‌కు(రూ.35,000), సంపంగి శ్రీనివాసులకు (రూ.38,000) చెక్కులను వారి ఇంటి వద్దకు వెళ్లి అందజేశారు. నందికొట్కూరు మార్కెట్ యార్డు డైరెక్టర్ మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, నందికొట్కూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ ముర్తుజావళి, టీడీపీ పట్టణాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, జమీల్ సౌదీ చాంద్, ఆర్టు శ్రీనివాసులు, లింగమయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో స్టాండ్ ఏర్పాటు చేయాలి

నందికొట్కూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నూతనంగా ఆటో స్టాండ్‌ను ఏర్పాటు చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య నాయకులు కోరారు. బుధవారం ఎమ్మెల్యే గిత్తా జయసూర్యకు వినతిపత్రం ఇచ్చారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరుణ్‌కుమార్, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మజీద్, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి నరసింహులు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గోపాల్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు దేవన్న, దిబ్బన్న, గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులు అధ్వానం

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వాహనదారులు



బురదమయంగా మారిన ఇస్కాల గ్రామంలోని బీసీ కాలనీ రోడ్డు

పాములపాడు, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర పేరిట గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధుల్లో మార్పు రావడం లేదు దీంతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా గ్రామాల్లో వర్షకాలంలో రహదారులు

ఎవరూ పట్టించుకోవడం లేదు



గ్రామంలో రోడ్లు అధ్వానంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. నిదులు వస్తున్నా గ్రామంలో అభివృద్ధి లేదు. ఉన్నతాధికారులు దృష్టి సారించాలి. విచారణ చేసి చర్యలు తీసుకోవాలి.

- నాగలక్ష్మిరెడ్డి, ఇస్కాల గ్రామం



గుంతలు పడిన గుండుపాపల-కృష్ణాపురం రహదారి

బురదమయంగా మారాయి. కనీం నడవడానికి కూడా వీలులేని దుస్థితి నెలకొనడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ఇస్కాల, చెలిమిళ్ళ, లింగాల, మిట్టకందాల, రుద్రవరం, బానుముక్కల తదితర గ్రామాలలో చినుకు పడితే చాలు గ్రామాలలోని దారులు బురదమయంగా మారుతున్న పంచాయతీ అధికారులు కాని సర్పంచులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఆస్కాల గ్రామంలో అబివృద్ధి కోసం ప్రభుత్వం నిదులు కేటాయించిన దారులు, డ్రైనేవ్యవస్థ అస్తవ్యస్తంగానే ఉందని నిదులు ఖర్చు అవుతున్నాయని, అయినా గ్రామంలో ఎలాంటి అబివృద్ధి జరగడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వర్షాలు కురుస్తుండటంతో గ్రామాలలో మురుగునీరు నిల్వ ఉండి దోమల వ్యాప్తి చెంది మలేరియా, టైఫాయిడ్ జ్వరాల బారిన ప్రజలు పడుతున్నారు. దీంతో చుట్టు పక్కల గ్రామాల ప్రైవేటు వైద్యశాలలు రోగులతో కిక్కిరిసి పోయారు. ప్రభుత్వం తగు నిధుల కేటాయిస్తూ ప్రణాళికాబద్ధంగా గ్రామాలలో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్న అధికారుల లోపమో, నాయకుల అలసత్వమో కాని గ్రామాల తీరులో మార్పు రావడం లేదు.

గోస్పాడు: మండలంలోని ఎం.కృష్ణాపురం వెళ్లేందుకు గుండుపాపల నుంచి కృష్ణాపురం వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చిన్నచిన్న ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఆరునెలల రోడ్డును ఆధునికీకరించాలని ప్రతిపాదనలు పంపినా ఇంతవరకు ఆచరణకు నోచుకోలేదు. వర్షాకాలం కావడంతో రోడ్డుపై ఉన్న గుంతల్లో నీరుచేరి గుంతలు కూడా సరిగా కనపడకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డు నిర్మాణంపై దృష్టి సారించాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు

పొజిషన్ సర్టిఫికెట్స్ మంజూరు చేయాలి

● ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



నాగటూరులో ఆర్డీవో నాగజ్యోతికి గ్రామ లే అవుట్ మ్యాప్‌ను చూపుతున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ప్రభుత్వ గృహాల మంజూరు కోసం పొజిషన్ సర్టిఫికెట్స్ మంజూరు చేయాలని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. నాగటూరుకు బుధవారం ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి పేదల ఇళ్ల స్థలాల కోసం స్థల పరిశీలనకు వచ్చారు. వీఆర్వో స్వాములు లే అవుటును, గ్రామంలో గల స్థలాన్ని చూపించారు. ఎమ్మెల్యే జయసూర్య అక్కడికి చేరుకుని ఆర్డీవోతో చర్చించారు. ప్రభుత్వ గృహాలు మంజూరు కావాలంటే ముందుగా స్థలానికి పొజిషన్ సర్టిఫికెట్ ఉండాలన్న ప్రభుత్వ నిబంధనలను ఆమెకు వివరించారు. ఆమె సానుకూలంగా స్పదించి భూమిని పరిశీలించి వెళ్లారు. తహసీల్దార్ శ్రీనివాసులు, వీఆర్వో జగదీష్, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

జూపాడుబంగ్లా: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. జూపాడుబంగ్లా గ్రామంలోని కాసానగర్‌లో బుధవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. శివమ్మ, గోవిందు దంపతుల పునీత్‌కు చికిత్స నిమిత్తం రూ.6 లక్షలు అవసరమని, ఆదుకోవాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లుయాదవ్, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రసాదరెడ్డి, కేసీకాల్వ చైర్మన్ పరమేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు సురేంద్రనాథ్‌రెడ్డి, సుధాకర్, పెద్దన్న, రవికుమార్‌యాదవ్, రమణారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, వేణుగోపాల్‌రెడ్డి, రవికాంత్ లక్ష్మన్నగౌడు, మన్సూర్‌బాషా, శాలుబాషా, మహిళా నాయకురాలు ప్రసన్నలక్ష్మీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ మృతికి సంతాపం

పగిడ్యాల: మండలంలోని సంకిరేణి పల్లె గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవరు సాలన్న (57) గుండెపోటుతో మృతి చెందారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సాలన్న మతదేహానికి నివాళి అర్పించారు. టీడీపీ మండల కన్వీనరు మహేశ్వరరెడ్డి, దామోదర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్‌కు నివాళి



నెహ్రూనగర్‌లో నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏకలవ్యానగర్, గరీబ్‌నగర్ కాలనీల్లో మాజీ సీఎం అచ్యుతానందన్ చిత్రపటాలకు సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మచ్చలేని మహానాయుడు అచ్యుతానందన్ అని నాయకులు రణధీర్, రామ్‌నాయక్, సురేంద్ర అన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకురాలు సువర్ణమ్మ, దానమ్మ, స్వర్ణ, శారద, మునెమ్మ, విజయలక్ష్మీ, శారద, సులోచన, సువర్ణ, లక్ష్మీదేవీ, రేణుకమ్మ, రమణ తదితరులు ఉన్నారు.

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సీపీఎం మండల కన్వీనర్ పక్కీర్‌సాహెబ్ మాట్లాడుతూ కేరళలో ప్రజ సమస్యల పై పోరాటాలు చేసిన గొప్ప నాయకుడు అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఈశ్వరమ్మ, బీరమ్మ, శ్రీనివాసులు, నారయణ, తిరుపాలు, మదు తదితరులు ఉన్నారు.

'స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలి'

ఆత్మకూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తక్షణమే విరమించుకోవాలని సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గురుశేఖర్, బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వినియోగదారులపై మోపిన ఇంధన సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ఏడాది ప్రజలపై వేసిన రూ.15526కోట్ల అదనపు భారాలను రద్దు చేయాలన్నారు. 2024-25 సంవత్సరంలో అదనంగా వసూళ్లు చేసిన రూ.2787కోట్లను తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయా ప్రజాసంఘాల నాయకులు సుధాకర్, టపాల్ అష్రఫ్ అలీ, శేఖర్, వీరన్న, వెంకటేశ్వర్లు, సురేంద్ర, మాబాషా, షేక్షావలి, ఆశీర్వాదం, సామేలు, శివుడు తదితరులు ఉన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి



డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ రత్నరాధిక

ఆత్మకూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): చౌకదుకాణాల ద్వారా లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీని చేయాలని తహసీల్దార్ రత్నరాధిక ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ఆయా రేషన్ దుకాణాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాలిటీతో పాటు మండలంలోని ఆయా గ్రామాలకు సంబంధించి సుమారు 2084 మంది ఈకేవైసీ నమోదు చేసుకోలేదని, అలాంటి వారు రేషన్ దుకాణాల డీలర్ల వద్దకు వెళ్లి త్వరితగతిన ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియపరిచేలా గ్రామాల్లో దండోరా వేయించాలని సంబందిత గ్రామ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సమావేశంలో సివిల్ సప్లైస్ డీటీ శ్రీనివాసులు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఆళ్లగడ్డ ఎమ్మెల్యే



కలెక్టర్ రాజకుమారికి ప్రసాదం అందజేస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

నంద్యాల రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ రాజకుమారి, జేసీ విష్ణుచరణ్‌ను ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ బుధవారం నంద్యాలలోని వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. రైతుల సమస్యలు, అభివృద్ధి పనులు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాష్ట్ర పురోగాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఆళ్లగడ్డలో అరాచకాలు కొనసాగించేందుకు ప్రయత్నించేవారిని, అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించే వారిని సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఆళ్లగడ్డలోని శిల్పా వెంచర్ మార్పుపై అధికారుల దృష్టికి తీసుకొచ్చి ఓ కొలిక్కి తీసుకొచ్చినట్లు తెలిపారు.

పంట సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

గోస్పాడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటలకు అవసరం మేరకే ఎరువులు వాడాలని, సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా వనరుల కేంద్ర సహాయ వ్యవసాయ సంచాలకులు సరళమ్మ సూచించారు. జిల్లెల్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు వేసిన మినుము, సోయాబీన్ పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు హేమసుందర్‌రెడ్డి, స్వప్నిక, అగ్రికల్చర్ అసిస్టెంట్ దివాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మహానంది: పెండింగ్లట ఉన్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ వెంటనే పూర్తి చేయాలని ఏవో నాగేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో వివిధ గ్రామాలలోని రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతు వేసిన పంటను సర్వే నెంబర్ వారీగా ఎలాంటి పొరపాట్లు లేకుండా పంట నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, లావణ్య, గ్రామాల రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ఇన్సూరెన్స్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

మిడుతూరు: ఖరీఫ్‌లో సాగు చేసిన మొక్కజొన్న, కంది పంటలకు రైతులు క్రాప్ ఇన్సూరెన్స్ చేసుకోవాలని వ్యవసాయ అధికారి పీరునాయక్ సూచించారు. సుంకేసుల, జలకనూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ అధికారి మొక్కజొన్న, కంది పంటల యాజమాన్యాల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈవోలు అశోక్, మల్లికార్జున రెడ్డి, ఆర్ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని రైతులు ఖరీఫ్‌లో వ్యవసాయశాఖ అధికారుల సలహాలు సూచనలు పాటించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని ఏవో మహేశ్వరరెడ్డి సూచించారు. మండలంలోని బనకచెర్ల గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంటసాగులో యాజమాన్య పద్ధతులు, ఎరువులు, పురుగుమందులు తగిన మోతాదులో వాడుకోవడం, చీడపీడలు, పురుగుల నివారణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: రైతులు తమ బ్యాంక్ ఖాతాలకు తప్పనిసరిగా ఆధార్ అనుసంధాన చేయించాలని ఏవో పవన్‌కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని శింగవరం, రామాపురం, సోమయాజులపల్లె రైతులతో కలసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పంట నమోదు చేయించాలని, కౌలు రైతులు విధిగా కౌలు కార్డులు పొందాలలని తెలిపారు. అలాగే వరికి ఆగస్టు 15లోగా బీమా చెల్లించాలని, మిగిలిన పంటలకు ఈ నెల చివరిలోగా భీమా సొమ్ములు చెల్లించి ప్రకృతి విపత్తుల వల్ల జరిగే నష్టానికి పరిహారం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జేడీవో మహబూబ్‌బాషా, ఉద్యానవన సహాయకులు ప్రియాంక పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన

పాములపాడు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపెంట గ్రామంలో క్షయవ్యాధి నిర్మూలనపై వైద్యాధికారి మల్లికార్జున, టీబీ సూపర్‌వైజర్ రవికుమార్ అవగాహన కల్పించారు. బుధవారం పీహెచ్‌సీలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో టీబీ మందులు వాడిన వారికి, వారి కుటుంబ సభ్యులకు, 60 ఏళ్ల పైబడిన వారికి ఇంటింటి సర్వే నిర్వహించి లక్షణాలు ఉన్న వారికి గళ్ల నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సిబ్బంది రవణమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

పగిడ్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన ఎరువులు పగిడ్యాల వ్యవసాయ పరపతి సొసైటీలో అందుబాటులో ఉన్నాయని ఏవో మురళీధర్ తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సొసైటీల ద్వారా రైతులకు యూరియా, డీఏపీ ఎరువు అందజేస్తున్నట్లు తెలిపారు. పగిడ్యాల సొసైటీలో 52 టన్నుల డీఏపీ, 12 టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. 30 టన్నుల యూరియా రావాల్సి ఉందని చెప్పారు. నెహ్రూనగర్ రైతు సేవాకేంద్రానికి 12 టన్నులు, ముచ్చుమర్రి రైతు సేవా కేంద్రానికి 12 టన్నులు, లక్ష్మాపురం రైతుసేవా కేంద్రానికి 12 టన్నుల యూరియా కోసం మార్క్‌ఫెడ్‌కు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

చదువుపై శ్రద్ధ చూపాలి

పాములపాడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చదువుపై శ్రద్ధ చూపి భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎస్ఐ సురేశ్‌బాబు సూచించారు. పాములపాడులోని ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు, ఆన్‌లైన్ గేమ్స్, సైబర్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు రవి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితాలను నాశనం చేస్తుందని ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి విద్యార్థులకు వివరించారు. మండలంలోని రాజరాజేశ్వరి హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులకు డ్రగ్స్‌పై, రోడ్డు ప్రమాదాలపై, ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. రోడ్డుప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రామేశ్వరరావు, రాఘవేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి

కొత్తపల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని ఉండాలని ఆత్మకూరు కంటి వైద్య నిపుణులు షేక్షావలి సూచించారు. బుధవారం జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో కొత్తపల్లి జడ్పీ హైస్కూల్, కేజీబీవీ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కేజీబీవీ పాఠశాలలో 24 మంది విద్యార్థినులకు, జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 14 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా.. 14 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించామని షేక్షావలి తెలిపారు. రోజూ విద్యార్థులు ఆహారంలో ఆకుకూరలు, గుడ్లు, పాలు తగిన మోతాదులో తీసుకుంటే దృష్టి లోపాన్ని నివారించవచ్చని తెలిపారు. ప్రిన్సిపాల్ కృష్ణాబాయి, హెచ్ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

బండిఆత్మకూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీసీ పాలెం గ్రామంలో 11 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. బుధవారం రాబడిన సమాచారం అందడంతో సిబ్బందితో గ్రామానికి చెందిన మాధవస్వామి ఇంట్లో తనిఖీలు చేయగా 11 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయని, వాటిని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి నిందితున్ని అరెస్టు చేశామని చెప్పారు. తెలిపారు. నంద్యాల మండలం కొత్తపల్లె గ్రామంలోని శిశుమందిర్ పాఠశాల విద్యార్థులకు స్టేషన్‌లో వైర్‌లెస్‌సెట్, మహిళా ఫిర్యాదు విభాగం, సీసీ కెమెరాల ద్వారా నిందితుల గుర్తింపు తదితరాలు అంశాల గురించి ఎస్ఐ వివరించారు.

మహాసభలను జయప్రదం చేయాలి

గోస్పాడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 30, 31తేదీల్లో డోన్‌లో జరిగే సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న, సీపీఐ మండల కార్యదర్శి హరినాథ్ పిలుపునిచ్చారు. బుధవారం గోస్పాడులో జిల్లా మహాసభల గోడపత్రికలను విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక చట్టాలు తెస్తున్నాయని వీటిని ఎండగట్టేందుకే జిల్లా సభలు నిర్వహిస్తున్నామన్నారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి జిలాని, మౌల, రమేష్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతి

గడివేముల, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపాడు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సత్యరాజు (72) బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. టీడీపీ నాయ కులు, మాజీ జడ్పీటీసీ సీతారామిరెడ్డి, టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణయాదవ్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, గిరిబాబు, నారాయణరెడ్డి తదితరులు సత్యరాజు మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

పాఠశాలల తనిఖీ

పాములపాడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పాములపాడులోని పాఠశాలలను మండల ప్రత్యేక అధికారి రాజు, ఎంఈవో సుభాషిణి, ఎంపీడీవోతో కలసి తనిఖీ చేశారు. బుధవారం ఎస్సీ కాలనీ, ఏఎస్ఆర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో దెబ్బతిన్న పైకప్పులను పరిశీలించారు.

చంద్రశేఖర్ ఆజాద్ ఆశయాలను కొనసాగిద్దాం

నంద్యాల కల్చరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): చంద్రశేఖర్ ఆశయాలను ఆశయాలను కొనసాగిద్దామని టీయూసీఐ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆశీర్వాదం పిలుపునిచ్చారు. శ్రీశైలం ప్రాజెక్టు కాలనీలోని భగత్ సింగ్ కాలనీలో చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో శ్రీను, వెంకటేశం, షేక్షావలి, డానియ, కన్న, మల్లమ్మ, శివ, అబ్దుల్ బాషా పాల్గొన్నారు.

'ఆ కుటుంబాలతో టీడీపీకి సంబంధం లేదు'

పాణ్యం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మరాజుపల్లెలో ఈనెల 22న టీడీపీకి చెందిన పది కుటుంబాలు వైసీపీలో చేరినట్లు అబద్ధాలు ప్రచారం చేసుకుంటున్నారని, ఆ కుటుంబాలతో టీడీపీకి ఎటువంటి సంబంధం లేదని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్‌నాయుడు అన్నారు. బుధవారం పాణ్యంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీలో చేరిన కుటుంబాలకు టీడీపీ సభ్యత్వం లేదని, పార్టీ కార్యక్రమాల్లో ఎప్పుడూ పాల్గొనలేదని అన్నారు. టీడీపీ తమ్మరాజుపల్లె అధ్యక్షుడు ఎర్రమల నాయుడు, దుబాయ్ శీను, ప్రతాప్, కృష్ణస్వామి పాల్గొన్నారు.

రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలి

నందికొట్కూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం పట్టణంలోని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత వారం రోజులుగా రుతుపవనాలు కదలికతో వర్షాలు పడడంతో రైతులు ఎరువులు వేయడానికి సిద్ధమవుతున్న సందర్భంలో యూరియా, డీఏపీ, వీటితో పాటు మరికొన్ని రకాల ఎరువులు రైతులకు అవసరమయ్యే ఎరువులు అందుబాటులో లేవన్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సమావేశంలో సోమన్న, గాబ్రియల్, శివకుమార్, తిరుపాలు, మహిళా సంఘం జిల్లా నాయకులు బీబీ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

1,008 బిందెలతో జలాభిషేకం

● దంపతులతో వరుణ యాగం



చాగలమర్రి పాత శివాలయంలో ఈశ్వరస్వామికి 1,008 బిందెలతో జలాభిషేకం చేస్తున్న డీలర్లు

చాగలమర్రి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పాత శివాలయంలో ఎరువులు, పురుగుమందుల డీలర్ల ఆధ్వర్యంలో బుధవారం వేద పండితుల సమక్షంలో అత్యంత వైభవంగా వరుణ యాగం, సుదర్శన హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆయలంలో కొలువుదీరిన ఈశ్వర స్వామికి 1,008 నీటి బిందెలచే జలాభిషేకం చేశారు. శివలింగం నీటితో నింపే వరకు జలాభిషేకం చేశారు. అనంతరం శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. వరుణ దేవుడు కరుణించాలంటూ సామూహికంగా పూజలు చేశారు. కార్యక్రమంలో ఏవో రంగనేతాజీ, వ్యవసాయ సిబ్బంది, ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, బీసీసెల్ స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, ఎరువులు, పురుగు మందుల డీలర్లు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

రైతులో సాగులో మెలకువలు పాటించాలి

రుద్రవరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : రైతులు సాగులో మెలకువలు పాటించి అధిక లాభాలు పొందాలని జిల్లా వనరుల కేంద్రం అసిస్టెంటు డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారి చెన్నయ్య అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మనపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద రైతులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఏడీఏ విజయశేఖర్, ఏవో సుమతి, ఏఈవోలు రాజు, పైహిమాతబుస్సం, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాలలో ఇంటర్వ్యూలు

బేతంచెర్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బేతంచర్ల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు రెండో విడత ఇంటర్వ్యూలలో కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ నిర్వహించారు. బుధవారం పట్టణంలోని ఐటీఐ కళాశాలలో ఎలక్ట్రీషన్, ఫిట్టర్, మెకానిక్ తదితర ట్రేడ్లకు కౌన్సెలింగ్ కొనసాగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ రెండో విడత ఇంటర్వ్యూకు 258 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇందులో 132 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పూల మొక్కలకు పెరిగిన గిరాకీ



మొక్కలను కొనుగోలు చేస్తున్న మహిళలు

కొలిమిగుండ్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జోరుగా వర్షాలు కురుస్తుండటంతో మా ర్కెట్లో పూల మొక్కలకు గిరాకీ ఏర్పడింది. ఇంటి పరిసరాలు, మేడపైన కుండీల్లో మొక్కలు నాటితే అవి త్వరి తగతిన పెరుగుతాయన్న కారణంగా మొక్కల కొనుగోలుకు మహిళలు ఆసక్తి కనబరుస్తున్నారు. పాణ్యం ప్రాంతం నర్సరీల నుంచి ఆటోల్లో మొక్కలను తీసుకువచ్చి గ్రామీణ ప్రాంతాల్లోనూ విక్రయిస్తున్నారు. దీంతో పూల మొక్కలకు మంచి గిరాకీ ఏర్పడినట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. ఒక్కో మొక్క రూ.30నుంచి రూ.100వరకూ విక్రయిస్తున్నారు.

పాఠశాలల తనిఖీ

చాగలమర్రి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.వనిపెంట చెంచుగూడెం, కొత్తపల్లె ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో న్యామతుల్ల బుధవారం తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేసిన విద్యామిత్ర కిట్లను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యాలయంలోనే చెత్త బుట్టలు

ఉయ్యాలవాడ, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామంలో చెత్త బుట్టలు పంపిణీ చేయటానికి నోచుకోవటం లేదు. గతేడాది సెప్టెంబరులో స్వచ్ఛ భారత్ కింద చెత్త బుట్టలు మంజూరయ్యాయి. ఈ బుట్టలను పంపిణీ చేయకుండా నేటికీ అలానే ఉంచారు. సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రాయలసీమ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

● ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

శిరివెళ్ల, జూలై 23(ఆంధ్రజ్యోతి) : రాయలసీమ ప్రాంత అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని గుంప్రమాన్‌దిన్నె మజారా గ్రామమైన రాజనగరం గ్రామంలో టీడీపీ నాయకుడు ప్రభాకర్‌రాజు తల్లి జయమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆమె చిత్రపటానికి ఎమ్మెల్యే బుధవారం నివాళి అర్పించారు. అనంతరం స్థానిక విలేకర్లతో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజల సంక్షేమానికి, రైతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుంటే.. వైసీపీ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. గుంప్రమాన్ దిన్నె గ్రామానికి చెందిన కుందూరు మోహన్‌రెడ్డి దంపతులు వ్యక్తిగత కారణాల వల్ల పదవులకు రాజీనామాలు చేసేందుకు సిద్ధపడినప్పటికీ వారితో చర్చించామన్నారు. మోహన్‌రెడ్డి దంపతులు ఎప్పటికీ పార్టీని, భూమా కుటుంబాన్ని వీడేదిలేదని ఆమె స్పష్టం చేశారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని టీడీపీ కార్యకర్తలు ఎప్పటికీ భూమా కుటుంబ సభ్యు లేనని.. అది వైసీపీ నాయకులు గుర్తు ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళి, నాయకులు కుందూరు మోహన్‌రెడ్డి, భరత్‌రెడ్డి, జవహర్‌రెడ్డి. ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే అఖిలప్రియ

నంద్యాల రూరల్: కలెక్టర్ రాజకుమారి, జేసీ విష్ణుచరణ్‌ను ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ బుధవారం నంద్యాలలోని వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. రైతుల సమస్యలు, అభివృద్ధి పనులు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాష్ట్ర పురోగాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఆళ్లగడ్డలో అరాచకాలు కొనసాగించేందుకు ప్రయత్నించేవారిని, అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించే వారిని సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఆళ్లగడ్డలోని శిల్పా వెంచర్ మార్పుపై అధికారుల దృష్టికి తీసుకొచ్చి ఓ కొలిక్కి తీసుకొచ్చినట్లు తెలిపారు.

వర్షాకాలంలో జాగ్రత్తగా ఉండాలి

డోన్ టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని విద్యుత్ ఏఈ కమలాకర్‌రావు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వర్షాకాలంలో తడిసిన కరెంటు స్తంభాలు ముట్టుకోకూడదని, విద్యుత్ తీగలను తాకరాదన్నారు. అలాగే ఇంటిలో ఉన్న స్విచ్ బోర్డులను తడి చేతులతో తాకరాదని, చిన్న పిల్లలు కరెంటు వస్తువులకు దూరంగా ఉంచాలని, బహిరంగ ప్రదేశాలలో ఎటువంటి విద్యుత్ ఉపకరణాలను చేతితో తాకకూడదన్నారు. అలాగే విద్యుత్ సమస్యలు ఏవైనా ఉంటే సంబంధిత అధికారులకు లేదా 1912కు ఫోన్ చేసి సమస్యను తెలియజేస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి

బేతంచెర్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పేదల అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకులు పోలూరు శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం బలపాలపల్లెలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పోనారపు భాస్కర్, రాచపోగుల ఈశ్వరయ్య, గురునాథ్, మద్దిలేటి, సుదర్శన్ రెడ్డి, శేఖర్, శివన్న, పౌలయ్య, మద్దిలేటి పాల్గొన్నారు.

శాకంబరిగా పార్వతీదేవి

చాగలమర్రి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని బుగ్గమల్లేశ్వర ఆలయంలో ఆషాడమాసం సందర్భంగా బుధవారం పార్వతీదేవి శాకంబరి అలంకారంలో కొలువుదీరారు. మహిళలు సామూహికంగా పార్వతీదేవిని పండ్లు, కూరగాయలు, పూలతో అలంకరింప చేశారు. చీర, సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

డోన్‌పై డ్రోన్ కెమెరా కన్ను

● అసాంఘిక కార్యకలాపాలకు పోలీసుల చెక్

డోన్ రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంతో పాటు మండలంలో డ్రోన్ కెమెరాలతో పోలీసులు నిఘా పెంచారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రూరల్ సీఐ రాకేష్‌బాబు, పట్టణ సీఐ ఇంతియాజ్ బాషాల పర్యవేక్షణలో సిబ్బంది డ్రోన్ కెమెరాల సాయంతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిని గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు. ముఖ్యంగా పట్టణ శివారు ప్రాంతాల్లో మండలంలోని అబ్బిరెడ్డిపల్లె చెరువు ప్రాంతాల్లో ఉన్న ఖాళీ ప్రదేశాల్లో బహిరంగంగా మద్యం తాగే మద్యంబాబులు డ్రోన్ కెమెరాలలో చిక్కుకుంటున్నారు. డ్రోన్ కెమెరాల సాయంతో వారిని గుర్తించి పోలీ సులు కౌన్సెలింగ్ చేస్తున్నారు.

సేవతోనే తృప్తి



బీరువాను బహూకరిస్తున్న ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు

డోన్ టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పేదలకు సేవ చేయడంలోనే సంతృప్తి లభిస్తుందని ఇన్నర్ వీల్ క్లబ్ ప్రెసిడెంటు శకుంతలారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని దొరపల్లె గ్రామంలో హై స్కూల్‌ను ఐరన్ బీరువాను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వి ద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలని పేర్కొన్నా రు. విద్యార్థులు వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి విజయలక్ష్మి, మర్రి సరళాదేవి, రాజా సుజాత, అనురాధ, శారద పద్మావతమ్మ పాల్గొన్నారు.

వచ్చేనెల 15నుంచి మహిళలకు ఉచిత బస్సు



పెద్దపూదిళ్లలో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

ప్యాపిలి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 15 నుంచి మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించనుందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పెద్దపూ దిళ్ల, చిన్నపూదిళ్ల, ప్యాపిలిలోని బీసీ కాలనీలో 'తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయడానికి సీఎం చంద్రబాబు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. పీ-4 కార్యక్రమంలో ద్వారా పేద కుటుంబాలను బంగా రు కుటుంబాలుగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. రైతుల వినతి మేరకు రూ.2.5కోట్లతో గుండాల చెరువు నుంచి చిన్నపూదిళ్ల, పెద్దపూదిళ్ల చెరువులకు పైపులైన్ నిర్మాణం చేపడుతున్నామన్నారు. వైసీపీ పాలన లో అక్రమాలకు పాల్పడిన వారికి శిక్షలు తప్పవన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వరరావుయాదవ్, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మీ నారాయణ యాదవ్, టి శ్రీనివాసులు, ప్రసాద్‌రెడ్డి, అలేబాదు పరమేష్, రామ్మోహన్ యాదవ్, ఖాజాపీర్, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేష్, దస్తగిరి పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థినికి బంగారు పతకం



చాందినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సదాశివమూర్తి

బనగానపల్లె, జూలై 23:(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశం కరా టే చాంపియన్ షిప్ 45 కిలోల విభాగంలో పట్టణంలోని కంకర గు రెడ్డి కళాశాలలో డిగ్రీ విద్యార్థి చాందిని బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ సదాశివమూర్తి తెలిపారు. బుధవారం విద్యార్థినిని ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రామచంద్రారెడ్డి, కోచ్‌లు కళ్యాణ్‌బాబు, సూర్యవంశీ ఉన్నారు.

ఉద్యోగావకాశాలు కల్పించాలి: సీపీఐ

బనగానపల్లె, జూలై 23:(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి శివయ్య తెలిపారు. ఈనెల 30, 31వతేదీల్లో డోన్‌లో జిల్లాస్థాయి సీపీఐ సభలను విజయవంతం చేయాలని బుధవారం పోస్టర్లను విడుదల చేశారు. మండల కార్యదర్శి శివయ్య మాట్లాడుతూ జిల్లాలోని పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా పక్క రాష్ట్రాల వారికి ఉద్యోగాలు ఇస్తున్నారన్నారు. నిరుద్యోగ భృతి రాష్ట్ర ప్రభుత్వం అందించాలని కోరారు. పొలాలు ఇచ్చిన రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సంజీవులు, జిల్లా సమితి సభ్యులు సుబ్బారెడ్డి, శివనాగయ్య, మద్దిలేటి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

గుర్రపు డెక్కల తొలగింపు

చాగలమర్రి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద కుందూవరద నీటిలో కొట్టుకువచ్చిన గుర్రపుడెక్క గేట్లకు అడ్డుపడింది. నీటి గేట్లు ఎత్తేందుకు వీలు లేకుండా ఉండటంతో బుధవారం లస్కర్లు, కూలీలు కలిసి గేట్లకు అడ్డుపడిన గుర్రపు డెక్కలను తొలగించేందుకు శ్రమించాల్సి వచ్చింది. కుందూ వరద ఉధృతి అధికంగా ఉంది. ఆ నీటిలో గుర్రపుడెక్క కొట్టుకపోయేలా చర్యలు తీసుకున్నారు. కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి పర్యవేక్షణలో పనులు చేశారు.

ఇద్దరు ఉపాధ్యాయులు నియామకం

రుద్రవరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీరంగాపురం ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించినట్లు బుధవారం ఇన్‌చార్జి ఎంఈవో వీరరాఘవయ్య తెలిపారు. పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 80 మంది విద్యార్థులు ఉన్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు ఉండడంతో విద్యాబోధన చేయడానికి ఆటంకం ఏర్పడింది. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించి ఇద్దరు ఉపాధ్యాయులను నియమించడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

పంట మార్పిడితో అధిక లాభాలు

ఉయ్యాలవాడ, జూలై 23(ఆంధ్రజ్యోతి): పంట మార్పిడితో అధిక లాభాలు పొందవచ్చని ఏఈవో సునీత తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మాయలూరు, రూపనగుడి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఈవో షఫియాబేగం, రూపనగుడి గ్రామ సర్పంచ్ దేశం సోమశేఖర్‌రెడ్డి, రైతులు పరమేశ్వ రరెడ్డి, సుబ్బ రాయుడు, వెంకటరామిరెడ్డి, చిన్న మస్తాన్‌వళి, తిమ్మయ్య, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సు రద్దుచేస్తాం



మాట్లాడుతున్న ఏడీఏ విజయశేఖర్

రుద్రవరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): యూరియాను రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని ఆళ్లగడ్డ ఏడీఏ విజయశేఖర్ హెచ్చరించారు. బుధవారం వ్యవసాయ కార్యాలయంలో మండల పరిధిలోని ఎరువులు, పురుగు మందులు షాపుల డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ నిర్దేశించిన ధరలకే విక్రయించాలని సూచించారు. కొనుగోలు చేసిన రైతులకు తప్పక రశీదులు ఇవ్వాలన్నారు. నెలవారీ స్టాకు క్రయ విక్రయాల వివరాలు మండల ఏవోకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో సుమతి, ఏఈవోలు రాజు, పైహిమా తబుస్సం, డీలర్లు పాల్గొన్నారు.

ఘనంగా బాలగంగాధర్ తిలక్ జయంతి

దొర్నిపాడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొర్నిపాడు శ్రీవాణి విద్యానికేతన్ పాఠశాలలో ఎంఈవోలు మనోహర్‌రెడ్డి, రామచంద్రయ్య ఆధ్వర్యంలో జాతీయ ఉద్యమ నేత బాల గంగాధర్‌తిలక్ జయంతిని ఘనంగా నిర్వహించారు. తిలక్ చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ గిరి, ఎంఈవోలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆపూస్ప ఆళ్లగడ్డ నియోజకవర్గ యూనిట్ అధ్యక్షుడు అమీర్‌బాష, ప్రధానోపాధ్యాయుడు గిరి, ఉపాధ్యాయులు ఉన్నారు.

పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే చర్యలు

ఆళ్లగడ్డ, జూలై 23(ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని ఎస్‌ఐ నగీన తెలిపారు. బుధవారం ఆళ్లగడ్డ పట్టణంలోని పలు పాఠశాలల సమీపంలోని దుకాణాలలో విజిబుల్ పోలీస్ కార్యక్రమంలో భాగంగా తనిఖీలు నిర్వహించారు. పొగాకు ఉత్పత్తులను, సౌభాగ్య పోడి అమ్మకాలపై నిఘా ఉంచామన్నారు. పలువురికి జరిమానాలు విధించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ వాహబ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ

ఆళ్లగడ్డ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ నంద్యాల పక్కీరప్ప స్వామి ఆలయంలో అనాథలకు అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అమ్మ సేవాసమితి వ్యవస్థాపకుడు నాగేష్, తదితరులు ఉన్నారు.

31లోగా పంటల బీమా చేయించుకోండి

సంజామల, జూలై 23,(ఆంధ్రజ్యోతి): పంటల బీమాను ఈ నెల 31 లోగా చేయించుకోవాలని వ్యవసాయ అధికారి జ్యోతి సూచించారు. బుధవారం నొస్సం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయశాఖ అమలు చేస్తున్న పంట బీమా, పంట నమోదు , కిసాన్ డ్రోన్స్ తదితర వాటిపై అవగాహన కల్పించారు.

రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం



మాట్లాడుతున్న నాయకులు

కొలిమిగుండ్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రామ్‌కో సిమెంట్ పరిశ్రమ బాధిత రైతులకు న్యాయం జరిగే వరకు సీపీఐ పోరాటం చేస్తుందని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు పేర్కొన్నారు. బుధవారం కొలిమిగుండ్ల మండల రైతు సంఘం అధ్యక్షులు పుల్లయ్యతో కలిసి వారు మాట్లాడుతూ పరిశ్రమ కాలుష్యంతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని చెప్పిన రామ్‌కో వర్గాలు తర్వాత మొండి చేయి చూపడం దారుణమన్నారు. ఇప్పటికే ప్రజాప్రతినిధుల దృష్టికి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్లామని, అయినా ఫలితం దక్కలేదన్నారు. త్వరలోనే రామ్‌కో యజమాన్యం దృష్టికి మరోసారి సమస్యను తీసుకెళ్లి ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. కల్వటాల గ్రామంలో దేవాదాయ శాఖ భూములను రామ్‌కో పరిశ్రమకు అప్పగించడం తీవ్ర ఆక్షేపణీయని రంగనాయుడు విమర్శించారు. భూములు కోల్పోయిన రైతులకు ఉద్యోగాలు కల్పించడంలోనూ, రైతులను ఆదుకోవడంలోనూ రామ్‌కో పూర్తిగా విఫలమైందన్నారు. రామ్‌కో రైతుల ఉద్యమాన్ని రాష్ట్ర స్థాయిలో చేపడతామని హెచ్చరించారు.

26న మండల సర్వసభ్య సమావేశం

సంజామల, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సాల్మన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

చాగలమర్రి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పీఆర్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ రవీంద్రారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం చిన్నవంగలి గ్రామంలో ఉపాధ్యాయులతో పీఆర్టీయూ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాయకులు సుదర్శన్‌రెడ్డి, ఆంజనేయ రెడ్డి, హరినాథ్‌రెడ్డి, రవిప్రకాష్‌రెడ్డి, దస్తగిరి, దాదాపీర్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



డీఎస్పీకి చెక్కును అందిస్తున్న సభ్యులు

డోన్ టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిఘా వ్యవస్థను పటిష్టం చేసేందుకు సీసీ కెమెరాల ఏర్పాటు కోసం మైన్స్ ఫల్వరైజర్స్ అసోసియేషన్ సభ్యులు విరాళం అందజేశారు. బుధవారం పట్టణంలోని డీఎస్పీ శ్రీనివాసులుకు రూ.నాలుగు లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారిని డీఎస్పీ అభినందించారు. కార్యక్ర మంలో సీఐలు ఇంతియాజ్ బాషా, రాకేష్, మైన్స్ ఫల్వరైజర్స్ ఓనర్లు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతంలో మెరుగైన వైద్యసేవలు

రుద్రవరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలు ప్రజలకు 104 ఆధ్వర్యంలో అందించాలని రాయలసీమ 104 రీజనల్ మేనేజరు ఇక్బాల్ అన్నారు. బుధవారం మండలంలోని అప్పనపల్లె గ్రామంలో నిర్వహించిన సంచార వైద్య చికిత్స కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామీణప్రాంతంలో సంచార వైద్యసేవలను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా మేనేజరు రఫీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం: సీఐ

కోవెలకుంట్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : కిరాణా దుకాణాల్లో సౌభాగ్య పౌడరు ప్యాకెట్లను విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ హెచ్చరించారు. బుధవారం ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ ఆధ్వర్యంలో సీఐ హనుమంతనాయక్ ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సిబ్బందితో కలిసి పట్టణంలోని పలు కిరాణా షాపుల్లో దాడులు నిర్వహించారు. సుమారు 300 ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కాల్చివేశారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

డోన్ టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): డోన్ నుంచి బదిలీ అయిన మండల సర్వేయర్ జగదీష్ తమను కుల పేరుతో దూషించారని ఆవులదొడ్డి గ్రామానికి చెందిన నాగన్న, మదన్‌మోహన్, కిష్టన్న, సోమేష్, మధు, శ్రీనాథ్ అన్నారు. బుధవారం డోన్ డీఎస్పీ శ్రీనివాస్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఆయనపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు.

పేదరికాన్ని రూపుమాపేందుకే పీ-4

డోన్ టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పేదరికాన్ని రూపుమాపడమే లక్ష్యంగా ప్రభుత్వం పీ-4 ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిందని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు అన్నారు. బుధవారం పట్టణంలోని 13, 14 సచివాలయాల్లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే బంగారు కుటుంబాలను ప్రాథమిక సర్వే ద్వారా గుర్తించామన్నారు. అందుకు సంబంధించిన తుది జాబితాను రూపొందించేందుకు గ్రామ, వార్డు సభలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ స్పెషల్ ఆఫీసర్, వార్డు ఇన్‌చార్జీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో అవినీతి

● రూ.3.24 లక్షలు విలువ చేసే మొక్కలు తిరిగి నాటించాలి: డ్వామా పీడీ సూర్యనారాయణ



సభలో విచారణ చేస్తున్న డ్వామా పీడీ, అధికారులు

చాగలమర్రి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో రూ.50 వేలు అవినీతి జరిగినట్లు విచారణలో తేలిందని డ్వామా పీడీ సూర్యనారాయణ తెలిపారు. బుధవారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయం వద్ద 19వ సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి 19 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పనుల కింద 1,946 పనులకు రూ.7.69 కోట్లు, పంచాయతీరాజ్ ద్వార 55 పనులకు రూ.1.77కోట్లు, ఆర్‌డబ్ల్యూఎస్ కింద 4 పనులకు రూ.48.38 లక్షలు ఖర్చు చేశారు. ఆయా గ్రామాల్లో వారం రోజులపాటు డీఆర్పీలు గ్రామాల్లో విచారణ చేపట్టి బహిరంగ సభలో నివేదికలను చదివి వినిపించారు. ఉపాధి పనుల్లో రూ.50 వేలు, రూ.3.24 లక్షలు విలువ చేసే మొక్కలను తిరిగి నాటాలని ఆదేశించినట్లు పీడీ తెలిపారు. అవినీతి సొమ్మును రికవరీకి ఆదేశించారు. సమావేశంలో విజిలెన్స్ జిల్లా అధికారి అన్వర్‌బేగం, సహాయ అధికారి శిబ, ఏపీడీ సాంబశివరావు, సోషియల్ ఆడిట్ అధికారి లోకేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ భాస్కర్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, పీఆర్ ఏఈ కొండారెడ్డి, ఏపీవోలు ఖాసీంసాహేబ్, నిర్మల, పశువైద్యాధికారి సాయిబాబా, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికడుదాం

డోన్ రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాను అరికడదామని బాలల సంరక్షణ జిల్లా అధికారి స్వప్న ప్రియదర్శిని అన్నారు. అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా బుధవారం డోన్ రైల్వేస్టేషన్‌లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా బాలల సంరక్షణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ అక్రమ రవాణాలో మహిళలు, బా లికలు, పిల్లలు ఎలా అక్రమ రవాణాకు గురవుతున్నా రో వివరించారు. అపరిచితుల మాటలు నమ్మి మోసపోవద్దని తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ సీఐ నాగభూషణం, ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్‌బేగం, డోన్ రైల్వేస్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తల్లులు అప్రమత్తంగా ఉండాలి

రుద్రవరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : చిన్నపిల్లల విషయంలో తల్లులు అప్రమత్తంగా ఉండాలని సీఐ దస్తగిరిబాబు అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని ఆర్.నాగలవరం గ్రామంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల విషయంలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. పాఠశాలకు వెళ్లే సమయంలో , వచ్చే సమయంలో జాగ్రత్తలు సూచించాలన్నారు. తమ పిల్లలు అన్ని విషయాల్లో జాగ్రత్తగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏదైనా అవసరం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎస్‌ఐ భూపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.